ముగ్గురు ఎంపీడీవోలకు పదోన్నతి

విశాఖపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మండల పరిషత్ అభివృద్ధి అధికారుల (ఎంపీడీవోలు)కు డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారులుగా పదోన్నతి లభించింది. పాయకరావుపేట ఎంపీడీవో ఎ.జయప్రకాశరావుకు పాడేరు డీడీవోగా, పద్మనాభం ఎంపీడీవో ఎం.విజయకుమార్‌కు అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డీడీవోగా పోస్టింగ్ ఇచ్చారు. డిప్యూటేషన్‌పై రుషికొండలో గిరిజన సంక్షేమ శాఖ కల్చరల్ ఇనిస్టిట్యూట్‌లో అసోసియేట్ ... మిగతా 8వ పేజీలో

నవంబరుకల్లా అనకాపల్లికి

పోలవరం నీరు

- వచ్చే ఏడాది నాటికి ఉత్తరాంధ్రలో మిగిలిన ప్రాంతాలకు తీసుకువెళ్లేలా ప్రణాళికలు
- విశాఖపట్నం జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి



మాట్లాడుతున్న మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి

విశాఖపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు ఎడమ కాల్వ ద్వారా నీటిని ఈ నవంబరు నాటికి అనకాపల్లి వరకూ తీసుకువస్తామని విశాఖపట్నం జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి ప్రకటించారు. వచ్చే ఏడాదికల్లా పోలవరం నీటిని ఉత్తరాంధ్రలో మిగిలిన ప్రాంతాలకు తీసుకువెళ్లేలా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా సమీక్షా సమావేశం జరిగింది. అందులో చర్చించిన అంశాలు, చేసిన తీర్మానాల వివరాలను విలేకరుల సమావేశంలో మంత్రి వెల్లడించారు. విశాఖ నగరం, పారిశ్రామిక సంస్థలకు అవసరమైన నీరు పోలవరం నుంచి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పోలవరం నుంచి వచ్చే నీటిని నిల్వ చేయడానికి 4.5 టీఎంసీల సామర్థ్యంతో చెరువుల నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు.

సమృద్ధిగా యూరియా



అనకాపల్లి మండలం తుమ్మపాల రైతు సేవా కేంద్రంలో యూరియా పంపిణీని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

అన్నదాతకు ప్రభుత్వం అండ

- రైతు సేవా కేంద్రాలకు నిల్వలు
- జిల్లాకు మరో 1,500 మెట్రిక్ టన్నులు
- ఖరీఫ్‌లో తీరనున్న ఎరువుల కష్టాలు
- అక్రమాలను అడ్డుకునేందుకు ప్రత్యేక నిఘా
- జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- ఫిర్యాదు చేయాల్సిన ఫోన్ నంబరు: 83310 56471

(అనకాపల్లి, ఆంధ్రజ్యోతి)

రైతులకు యూరియా కష్టాలు ఎదురవకుండా ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో వ్యవసాయ శాఖామంత్రి అచ్చెన్నాయుడు తరచూవీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించి యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కలెక్టర్లను అప్రమత్తం చేశారు. ఈ మేరకు జిల్లాలో ఇప్పటికే అందుబాటులో ఉన్న యూరియాను పంపిణీ చేస్తున్న అధికారులు, మరిన్ని నిల్వలు రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌లకు చేరవేసేందుకు ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు.



కె.కోటపాడు రైతు సేవా కేంద్రం నుంచి యూరియా బస్తా తీసుకువెళుతున్న రైతు

జిల్లాలో సబ్ డివిజన్ల వారీగా కంట్రోల్ విభాగాల ఫోన్ నంబర్లు

డివిజన్	ఫోన్ నంబరు
అనకాపల్లి	83310 56383
చోడవరం	83310 56402
నర్సీపట్నం	83310 56410
ఎలమంచిలి	83310 56389
పాయకరావుపేట	83310 56395

ఖరీఫ్‌లో రైతుల యూరియా అవసరాలను దృష్టిలో పెట్టుకొని అందరికీ ఎరువు అందేలా కలెక్టర్ విజయకృష్ణన్ పర్యవేక్షణలో ముందస్తు చర్యలు తీసుకున్నారు. పంపిణీని అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ వరి సాగు విస్తీర్ణం 54,465 హెకార్లుగా లక్ష్యం నిర్దేశించారు. అడపాదడపా కురుస్తున్న వర్షాలతో ఇప్పటికే రైతులు 45 వేల హెక్టార్లలో వరి నాట్లు పూర్తిచేశారు. ఈ దశలో యూరియా కొరత రాకుండా చూడాలని యంత్రాంగం రైతు సేవాకేంద్రాలు, మార్క్‌ఫెడ్, పీఏసీఎస్, లైసెన్స్ పొందిన ప్రైవేటు డీలర్ల వద్ద 895.11 మెట్రిక్ టన్నుల నిల్వలు అందుబాటులో ఉంచారు. దీంతో పాటు మరో రెండు, మూడు రోజుల్లో 1,500 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు దిగుమతి అయ్యేలా చర్యలు చేపట్టారు. ఇందులో స్పిక్ కంపెనీ నుంచి 100 టన్నులు, ఐపీఎల్ కంపెనీ నుంచి 630 టన్నులు,



నాతవరం మండలం గన్నవరంమెట్టలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న తహశీల్దార్ వేణుగోపాల్, వ్యవసాయాధికారి సుగుణ

మిగిలిన కంపెనీల నుంచి 770 టన్నులు జిల్లా కేంద్రానికి చేరనున్నాయి.

పక్కదారిపై ప్రత్యేక నిఘా

జిల్లాలో ఈ ఏడాది యూరియా పక్కదారి పట్టకుండా అధికారులు పటిష్ఠ చర్యలు చేపట్టారు. ఏటా కేంద్ర ప్రభుత్వం యూరియాలో 70 శాతం ఏపీ మార్క్‌ఫెడ్‌కు సరఫరా చేస్తుంది. అక్కడి నుంచి పీఏసీఎస్‌లకు చేరుతుంది. సొసైటీలకు సరఫరా అవుతున్న యూరియాలో అధికశాతం నిల్వలు స్థానిక నేతలు, బడా రైతులకు చేరేలా తెర వెనుక పావులు ... మిగతా 8వ పేజీలో

సబ్‌జైలు సిబ్బంది పై క్రమశిక్షణ చర్యలు?

రిమాండ్ ఖైదీల పరారీ ఘటనపై అధికారుల సీరియస్

- అనారోగ్యంతో ఉన్న సిబ్బందికి విధులు
- ఖైదీలు తప్పించుకునేందుకు అదే అవకాశం
- వెలుగులోకి సబ్‌జైలు నిర్వహణ లోపాలు?

చోడవరం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి):



చోడవరం సబ్‌జైలు

వార్డర్‌పై సుత్తితో దాడి చేసి పట్టణంలోని సబ్‌జైలు నుంచి ఇద్దరు రిమాండ్ ఖైదీలు పరారైన ఘటనపై ఉన్నతాధికారులు సీరియస్‌గా స్పందించారు. ఘటనకు సంబంధించి, సబ్‌జైలు అధికారులతో పాటు, సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలకు రంగం సిద్ధం చేసినట్టు సమాచారం. విధుల్లో ఉన్న వార్డర్‌పై సుత్తితో దాడిచేసి, రిమాండ్ ఖైదీలు నక్కా రవికుమార్, బెజవాడ రాము తప్పించుకున్న వ్యవహారాన్ని పోలీసు. జైళ్ల శాఖ ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించినట్టు తెలిసింది. ఘటన జరిగిన రోజు సబ్‌జైలు సూపరింటెండెంట్‌తో పాటు, వార్డర్, మరో నలుగురు గార్డులు విధుల్లో ఉన్నప్పటికీ, ఖైదీలు తమప్లాన్ అమలు చేసి పారిపోయినట్టు అధికారుల పరిశీలనలో బయటపడినట్టు సమాచారం.

సబ్‌జైలు నిర్వహణలో అధికారులు అనేక లోపాలు గుర్తించినట్టు చెబుతున్నారు. వాస్తవానికి సబ్‌జైలులో విధుల్లో ఉన్న పోలీసుల్లో ముగ్గురు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండడం, తగినంత ఫిట్‌గా లేకపోవడంతో వార్డర్‌పై దాడి జరుగుతున్నా అడ్డుకునే స్థాయిలో స్పందించలేదని చెబుతున్నారు. దీనికితోడు మరో జైలు అధికారి వినికిడి లోపంతో బాధపడుతున్నట్టు సమాచారం. ఖైదీల చేతిలో దాడికి గురైన వార్డర్‌తో పాటు, మరో వార్డర్ మినహా మిగిలిన వారంతా అనారోగ్య సమస్యలతోనే విధులు నిర్వహిస్తున్నట్టు అధికారుల విచారణలో తేలింది. వీరి పరిస్థితి గమనించిన తరువాతే ఖైదీలు, తమ ప్లాన్ పక్కాగా అమలుచేసి తప్పించుకున్నారని భావిస్తున్నారు. దీనికితోడు సబ్‌జైలులోని రెండో గేటు తెరిచి ఉంచడం తదితర నిర్లక్ష్య చర్యలు ఖైదీలు పారిపోవడానికి కారణంగా అంచనా వేస్తున్నారు. సబ్‌జైలు బయట కూడా భద్రతాపరమైన ఏర్పాట్లు లేకపోవడం విమర్శలకు తావిస్తున్నది. సబ్‌జైలు ప్రాంగణంలో గదులు బాగానే ఉన్నప్పటికీ, ప్రహరీ శిథిలావస్థలో ఉంది. జైలు ఆవరణలో మినహా, గేటు బయట ఒక్క ... మిగతా 8వ పేజీలో

సబ్‌జైలు నుంచి తప్పించుకున్న రిమాండ్ ఖైదీలు పట్టివేత

- విశాఖలో పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది | - వివరాలు మెయిన్ 3లో

బకాయిల కోసం నిరీక్షణ

నర్సీపట్నం నియోజకవర్గంలో రూ.42 కోట్లతో 521 పనులు మంజూరు

- 452 పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లు
- మార్చిలో రూ.22 కోట్లకు బిల్లులు అప్‌లోడ్ చేసిన పీఆర్ అధికారులు
- ఇప్పటివరకూ కేవలం రూ.8 కోట్లు మాత్రమే విడుదల
- మరో రూ.14 కోట్లకు ఎదురుచూపులు



నాతవరం మండలం పెదజగ్గంపేటలో నిర్మాణం పూర్తి చేసుకున్న సీసీ రోడ్డు

నర్సీపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): **పల్లె పండగ బిల్లు బకాయిల కోసం కాంట్రాక్టర్లు ఎదురుచూస్తున్నారు. మార్చిలో సుమారు రూ.22 కోట్లకు బిల్లులు అప్‌లోడ్ చేస్తే రూ.8 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. దీంతో పనులు చేసిన కాంట్రాక్టర్లు సకాలంలో డబ్బులు అందక ఆర్థిక ఇబ్బంది పడుతున్నారు.**



నర్సీపట్నం మండలం కొండల అగ్రహారంలో నిర్మాణంలో ఉన్న శ్మశాన వాటిక షెడ్డు

నియోజకవర్గంలోని నర్సీపట్నం, గొలుగొండ, నాతవరం, మాకవరపాలెం మండలాలకు రూ.14 కోట్లు బకాయిలు పేరుకుపోయాయి. గత ఏడాది అక్టోబరు 14 నుంచి 20 వరకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహించారు. అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులకు భూమి పూజలు జరిగాయి. పనులు పూర్తిచేసిన కాంట్రాక్టర్లకు ప్రతి వారం చెల్లింపులు జరుపుతామని ప్రకటించడంతో ఉత్సాహంగా పూర్తిచేశారు. గత ఏడాది నవంబరు చివరివారం, డిసెంబరు మొదటి వారంలో రెండు వారాలకు సంబంధించిన డబ్బులు జమయ్యాయి. ఆ తర్వాత పెండింగ్‌లో పడిపోయాయి. ఈ ఏడాది మార్చిలో అప్‌లోడ్ చేసిన బిల్లుల్లో కనీసం సగం కూడా జమకాలేదు. నర్సీపట్నం నియోజకవర్గంలో పల్లె పండగ ... మిగతా 8వ పేజీలో

శారదానదిలో యువతి గల్లంతు

- గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు




ఉమ్మలాడ శారదానదిలో పోలీసుల గాలింపు చర్యలు , గల్లంతైన యువతి (ఫైల్ ఫొటో)

మునగపాక, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శారదా నదిలో పడి ఓ యువతి గల్లంతయింది. ఈ సంఘటన మండలంలోని ఉమ్మలాడ పరిధిలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... అనకాపల్లి గవరపాలేనికి చెందిన యువతి శారదా బ్రిడ్జిపై నుంచి దూకినట్టు సమాచారం రావడంతో ఘటనా స్థలానికి చేరుకుని విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టినట్టు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. గల్లంతైన యువతి గరవపాలేనికి చెందిన బి.కీర్తిగా చెబుతున్నారన్నారు. చీకటి పడడంతో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి ప్రత్యేక బలగాలతో గాలింపు చర్యలు చేపడుతున్నామన్నారు. సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. విషయం తెలుసుకున్న అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ తదితరులు శారదా బ్రిడ్జి వద్దకు వచ్చి గాలింపు చర్యలను పరిశీలించారు.

పిన్న వయసులోనే అవాస్కులర్ నెక్రోసిస్

కొవిడ్ తరువాత గణనీయంగా పెరిగిన బాధితులు

- కేజీహెచ్‌కు గతంలో నెలకు ఒకటి, రెండు కేసులు
- ఇప్పుడు రోజుకు రెండు...
- ఎముకకు రక్త ప్రసరణ నిలిచిపోవడంతో సమస్య ఉత్పన్నం
- స్టెరాయిడ్స్ వినియోగం కొంత కారణం
- ప్రాథమిక దశలో గుర్తించడం కీలకమంటున్న వైద్య నిపుణులు



విశాఖపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గత కొన్నాళ్లుగా అవాస్కులర్ నెక్రోసిస్ (ఏవీ ఎన్)/ ఆస్టియో నెక్రోసిస్ బారినపడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోందని వైద్యులు చెబుతున్నారు. ఎముకకు రక్త ప్రసరణ తగ్గడం వల్ల ఈ సమస్య తలెత్తుతోందంటున్నారు. కేజీహెచ్‌లోని ఆర్థో విభాగం ఓపీకి కరోనాకు ముందు నెలకు ఒకటి, రెండు కేసులు వస్తే, ప్రస్తుతం రోజుకు ఒకటి నుంచి రెండు వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. బాధితుల సంఖ్య కొన్ని రెట్లు పెరిగినట్టు వైద్యులు పేర్కొంటున్నారు.

ఏవీఎన్ అంటే ఏమిటి.?

ఎముకకు రక్త ప్రసరణ నిలిచిపోవడాన్ని అవాస్కులర్ నెక్రోసిస్ (ఏవీఎన్) అంటారు. శరీరంలో ఎక్కడైనా ఎముకకు రక్త ప్రసరణ నిలిచిపోతే ఆ భాగం ఏవీఎన్ బారినపడుతుందంటున్నారు. ఎక్కువగా తుంటి ఎముక, యాంకిల్ జాయింట్, రిస్ట్ భాగాల్లో సమస్య వస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు. కరోనా వైరస్ తరువాత రక్తనాళాల్లో మార్పులు, అధికంగా స్టెరాయిడ్స్ వినియోగం వంటివి ఈ సమస్యకు కారణమవుతున్నట్టు పేర్కొంటున్నారు. కొన్ని కారణాల వల్ల రక్త ప్రసరణ తగ్గిపోయి ఎముక కణజాలం చనిపోతుంది. రక్త ప్రసరణ ఉన్న సమయంలో గట్టిగా ఉండే ఎముక కణజాలం బోన్ డెడ్ అయిన తరువాత ... మిగతా 8వ పేజీలో

రహదారి అధ్వానం

ఘోరంగా ఎలమంచిలి - గాజువాక రోడ్డు

- పలుచోట్ల గుంతలు.... తరచూ ప్రమాదాలు
- రాకపోకలకు అవస్థలు పడుతున్న ప్రయాణికులు

పరవాడ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి - గాజువాక ప్రధానమార్గంలో ఊటగెడ్డ జంక్షన్ నుంచి బంగ్లాజంక్షన్ మధ్య రహదారి అధ్వానంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే రహదారిలో పలుచోట్ల పెద్ద పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. దీంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టి ఏడాది గడవకముందే గుంతలు పడడంపై వాహనచోదకులు మండిపడుతున్నారు. ఇదే రహదారి గుండా సింహాద్రి ఎన్టీపీసీ, అచ్యుతాపురం సెజ్, ఫార్మాసిటీకి చెందిన కార్మికులు, ఉద్యోగులతో పాటు పరవాడ, వెన్నెలపాలెం, రావాడ, బొట్లవానిపాలెం, గాజువాక, విశాఖపట్నం తదితర గ్రామాలకు చెందిన ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో రహదారిపై ఏర్పడిన గుంతలతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో ప్రయాణించాలంటేనే హడలిపోతున్నారు. పరిమితికి మించి బొగ్గు లోడుతో లారీలు ఇదే రహదారిపై రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో గుంతలు మరింత పెద్దవిగా మారి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఏమరపాటుగా ప్రయాణిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందే. ప్రతి రోజు రాకపోకలు సాగించే కార్మికులు, ఉద్యోగులు ఈ రోడ్డు దుస్థితిపై తీవ్రంగా మండిపడుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి రహదారిపై గుంతలను పూడ్చి వేసేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



టీ రాజా హోటల్ సమీపంలో దెబ్బతిన్న రహదారి



పరవాడ సినిమాహాల్ జంక్షన్ సమీపంలో రహదారిపై పెద్ద గొయ్యి

వెళ్లిరా... గణపయ్య!

- ఘనంగా గణనాథుల నిమజ్జనోత్సవం



పాయకరావుపేట మండలం సత్యవరంలో గణనాథుడి ఊరేగింపు - 8లో

రసాయన ఎరువుల అధిక వాడకంతో అనర్థాలు

▸ నానో యూరియా ద్వారా డబ్బు ఆదా, అధిక ప్రయోజనం

▸ వ్యవసాయ శిక్షణలో జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

మునగపాక, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి) : పంటలకు మోతాదుకు మించి ఎరువుల వాడకం మంచిది కాదని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు అన్నారు. మండల కేంద్రం మునగపాకలో శనివారం రైతులకు ఏర్పాటైన వ్యవసాయ శిక్షణలో మాట్లాడారు. వేసిన పంట త్వరగా ఏపుగా పెరిగి, పచ్చగా కనిపించాలన్న ఉద్దేశ్యంతో ఎరువులను ఎక్కువగా వాడుతున్నారన్నారు. అనకాపల్లి జిల్లాలో ఏటా అన్ని రకాల ఎరువులు కలిపి సుమారు 55 వేల మెట్రిక్ టన్నులు వినియోగిస్తున్నారని వివరించారు. ఎకరా పంటకు నానో యూరియా 500 ఎంఎల్ బాటిల్ సరిపోతుందని, దీని ధర కేవలం రూ.240 మాత్రమేనన్నారు. డీఏపీ, పొటాష్ వంటి ఎరువులు కూడా నానోలో ఉన్నాయని, బస్తా ధర కంటే వీటి ధర మూడు రెట్లు తక్కువగా ఉంటుందని వివరించారు. అవసరానికి మించి రసాయన ఎరువుల వినియోగం పలు అనర్థాలకు దారితీస్తుందని చెప్పారు. అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ సంచాలకులు సీహెచ్.బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ డ్రోన్ వినియోగం ఎంతో శ్రేయస్కరంగా పేర్కొన్నారు. దీని వల్ల సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. డ్రోన్ ద్వారా నానో ఎరువు పిచికారీ విధానాన్ని క్షేత్రస్థాయిలో చూపించారు. మండల వ్యవసాయాధికారిణి సిహెచ్.జ్యోత్స్నకుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు లక్ష్మి, పద్మిని, లలితతో పాటు జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశురాం, పీఏసీఎస్ చైర్‌పర్సన్ విల్లూరి నూకనర్సింగరావు, రైతు సంఘం అధ్యక్షుడు ఆడారి మహేష్, ఉపాధ్యక్షుడు ఆడారి శ్రీకాంత్, దాడి శివ, ఆడారి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో భారీ వర్షం



ఎలమంచిలిలో వర్షం కురుస్తున్న దృశ్యం

ఎలమంచిలి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో మార్పుల కారణంగా పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. అర్ధగంట పాటు ఏకధాటిగా పడడంతో అంతటా ఒక్కసారిగా చల్లబడింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత కొనసాగడంతో అంతా ఉక్కిరిబిక్కిరయ్యారు. ఈ వర్షం వ్యవసాయ పనులకు ఉపయుక్తంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా గణపతి విగ్రహాల నిమజ్జనం

▸ మేళతాళాలు, కోలాటాల నడుమ పురవీధుల్లో ఊరేగింపు ▸ పిల్లలు, యువకుల కేరింతల నడుమ వేడుక



ఎలమంచిలి మండలం పేట బయ్యవరంలో స్వామి విగ్రహం ఊరేగింపు



రాంబిల్లి మండలం వాడ నర్సాపురంలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఎలమంచిలి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వినాయక నవరాత్రి ఉత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో గల వివిధ ప్రాంతాల్లోని మండపాల్లో కొలువుదీరిన స్వామి విగ్రహాలను నిమజ్జనం చేశారు. తొమ్మిది రోజుల పాటు ఆది దేవునికి విశేష పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని కోర్టు పేట పూర్ణసాయి జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని నిర్వాహకులు మేళతాళాలు, కోలాటాలు, భజనల నడుమ పురవీధుల్లో ఊరేగిస్తూ నిమజ్జనం చేశారు. అలాగే, తులసీనగర్, పరమేశ్వరీ థియేటర్ జంక్షన్, కొత్తపేట పాత రాయాలయం వీధి తదితర ప్రాంతాల్లోని వినాయక విగ్రహాను నిమజ్జనం చేశారు. ఇదిలావుంటే, పెదపల్లిలో వినాయక విగ్రహం వద్ద స్వామి ప్రసాదంగా పెట్టిన లడ్డూ వేలం న్విహించారు. గ్రామానికి చెందిన గొర్లె రామునాయుడు తొమ్మిది వేల రూపాయలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, కాలనీల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇదిలావుంటే, ఎలమంచిలి ఎన్టీఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన బాలగణపతి విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు స్థానిక నేతలతో కలిసి దర్శించుకున్నారు. వీరికి స్థానిక నాయకులు, నిర్వాహకులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ కరణం రవికుమార్, దంట్ల వెంకటస్వామి, కిల్లాడి అప్పారావు, దాడి రమేష్ పాల్గొన్నారు. అలాగే, మండలంలోని పద్మనాభరాజుపేట, బయ్యవరం గ్రామాల్లో శనివారం భారీ వినాయక విగ్రహాలను కోలాహల వాతావరణం నడుమ నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఇదిలావుంటే,



ఎలమంచిలి కొత్తపేటలో బాలగణపతి విగ్రహం వద్ద వేలంలో లడ్డూ దక్కించుకున్న భక్తుల సందడి

అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఎలమంచిలి కొత్తపేటలో బాలగణపతి వేడుకలను నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు విశేష పూజల అనంతరం స్వామివారి ప్రసాదంగా ఉంచిన లడ్డూను వేలం వేశారు. పట్టణంలోని అరుణాచలం వైన్స్ నిర్వాహకులు, కూటమి నేతలు బొద్దపు శ్రీను, ఇత్తంశెట్టి సన్యాసినాయుడులు రూ.20,700లకు దక్కించుకున్నారు. స్థానిక నేతలు గుప్తా, కరణం రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

మునగపాక మండలంలో...

మునగపాక : వినాయక నవరాత్రి ఉత్సవాలు శనివారం ముగిసిన సందర్భంగా గ్రామాల్లో వీధివీధిన కొలువుదీరిన గణపతి విగ్రహాలను ఆనందోత్సాహాల నడుమ శనివారం నిమజ్జనం చేశారు. ఉదయం విశేష పూజలు నిర్వహించి, మధ్యాహ్నం అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు. సాయంత్రం మేళతాళాలు, బాజాభజంత్రీలు పిన్నలు పెద్దల కోలాహలం నడుమ నిమజ్జనం చేశారు. మునగపాకలోని ఎన్టీఆర్ కాలనీతో పాటు మిల్లు వద్ద, ఉప్పర దిబ్బతో పాటు పలు ప్రాంతాల్లో కొలువదీరిన ఆదిదేవుడ్ని నిమజ్జనం చేశారు.

రాంబిల్లి మండలంలో...

రాంబిల్లి : వినాయక నవరాత్రి ఉత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా వీధివీధిన కొలువుదీరిన గణపయ్య విగ్రహాలను ఆనందోత్సాహాల నడుమ నిమజ్జనం చేశారు. వాడనర్సాపురంలో ఈ వేడుక మరింత ఘనంగా జరి గింది. మేళతాళాలు, కోలాటాల నడుమ విగ్రహాలను ఊరేగించి నిమజ్జనం చేశారు. అంతకుముందు అన్నసమారాధన జరిపారు. భక్తులతో పాటు ఎల్అండ్‌టీ పరిశ్రమ నుంచి 130 కిలోల బియ్యం, వంట నూనె తదితరాలను అందజేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

అచ్యుతాపురం మండలంలో...

అచ్యుతాపురం : గణపతి నవరాత్రి ఉత్సవాలు ముగిసిన సందర్భంగా మండలంలోని ప్రతి గ్రామంలో వీధివీధినా ఏర్పాటు చేసిన స్వామి విగ్రహాలను శనివారం నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి విశేష పూజలు నిర్వహించి, అన్నసమారాధన జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం

ఎలమంచిలి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బాలికోన్నత ప్లస్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఉపాధ్యాయులతో డిప్యూటీ డీఈవో పి.అప్పారావును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదన్నారు. విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్న అందరికీ అభినందనలు తెలిపారు. ప్రతి ఒక్కరూ మరింత అంకితభావంతో విధులు నిర్వహించి సత్ఫలితాలు సాధించాలన్నారు. హెచ్ఎం కె.సుశీలతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



డిప్యూటీ డీఈవో అప్పారావును సత్కరించిన ఉపాధ్యాయ సిబ్బంది

ఎరువుల కోసం రైతులు ఆందోళన చెందవద్దు : ఎమ్మెల్యే



విజయ్‌కుమార్

ఎలమంచిలి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఎలమంచిలి, అచ్యుతాపురం, రాంబిల్లి, మునగపాక మండలాల్లోని రైతులు ఎరువుల కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. రైతులందరికీ ఎరువులు అందేవిధంగా ఏర్పాట్లు చేసినట్టు వివరించారు. రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఎరువుల కొరత అంటూ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దని, అటువంటి వారికి తగిన బుద్ధి చెప్పాలని ఆయన సూచించారు.

చోరీల నియంత్రణకు ప్రజలు సహకరించాలి

సీఐ నమ్మి గణేశ్



అచ్యుతాపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : చోరీల నియంత్రణకు అంతా సహకరించాలని సీఐ నమ్మి గణేశ్ కోరారు. శనివా రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల చిల్లర దొంగతనాలు తరచూ జరుగుతున్నాయన్నారు. దీనిపై తాము గట్టి నిఘా ఏర్పాటు చేసినప్పటికీ ప్రజలు తమకు సహకారం అందించాలన్నారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురంలో వివిధ రాష్ట్రాలకు చెందినవారు కర్మాగారాల్లో పనిచేస్తున్నారని, వారు అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిధిలో గల పలు ప్రాం తాల్లో నివాసముంటున్నారని వివరించారు. ఆయా ప్రాంతాల్లో అపరిచితులను గమనిస్తే తమకు వెంటనే సమాచారం అందించాలన్నారు. అలాగే, వీలైనంత వరకు అంతా సీసీ కెమేరాలు ఏర్పాటు చేసుకోవాలని, దూర ప్రాంతాలకు వెళ్లాల్సివస్తే తమకు ముందుగా సమాచారం తెలియజేయాలన్నారు. అటువంటి వారి ఇళ్ల వద్ద ఎల్‌హెచ్ ఎంఎస్ ఏర్పాటు చేస్తామన్నారు. మేడపై, ఇంటిబయట పడుకునే వారు ఇంటి తలుపులకు తాళాలు వేసుకోవాలన్నారు. అలాగే తమ పిల్లలు పాఠశాలకు సక్రమంగా వెళుతున్నారా? లేదా? అని పరిశీలించుకోవాలని సూచించారు. పాఠశాలలకు దుమ్మా కొట్టి కొందరు పిల్లలు దేవాలయాల్లో హుండీ చోరీలకు పాల్పడుతున్నారని తెలిపారు. అలాంటి నలుగుర్ని శుక్రవారం అదుపులోకి తీసుకున్నామన్నారు. అచ్యుతాపురంలో రాత్రి పూట గస్తీని పెంచినట్టు వివరించారు.


ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని పాదయాత్ర



ఆటో డ్రైవర్ చింతకాయల శ్రీను పాదయాత్రలో సంఘీభావం తెలుపుతున్న పలు ఆటో యూనియన్‌ల నాయకులు

ఎస్. రాయవరం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఫ్రీ బస్సుతో నష్టపోతున్న ఆటో డ్రైవర్‌లను ఆదుకోవాలని కోరుతూ, విశాఖ నుంచి అమరావతి వరకు పాదయాత్రగా వెళ్తున్న చింతకాయల శ్రీను అనే ఆటో డ్రైవర్‌కు శనివారం మండలంలోని అడ్డరోడ్డు, రేవుపోలవరం, బంగారమ్మపాలెంతో పాటు నక్కపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి, తుని తదితర పలు ప్రాంతాల్లో ఆటో యూనియన్‌లకు చెందిన డ్రైవర్లు ఘనంగా స్వాగతం పలికారు. ఆయనకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా చింతకాయల శ్రీను మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు తో ఆటో డ్రైవర్లంతా ఆర్థికంగా నష్టపోయారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోకుంటే మరింత ఎదుర్కోవలసి వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ఉచిత బస్సు పథకాన్ని రద్దు చేశారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగించాలి



అరట్లకోటలో పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో మూర్తి

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగించాలని డీఎల్‌పీవో మూర్తి అన్నారు. మండలంలోని అరట్లకోట గ్రామాన్ని శనివారం ఆయన సందర్శించి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య పనులను క్రమం తప్పకుండా చేపట్టాలన్నారు. వాటర్ ట్యాంకులను పరిశీలించారు. వ్యాధులు ప్రబలకుండా దోమల మందును పిచికారీ చేయాలన్నారు. ఈవోపీఆర్‌డీ డేవిడ్, పంచాయతీ కార్యదర్శి రమేశ్, సర్పంచ్ పులగపూరి అప్పలనర్స, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

భూ సమస్య పరిష్కారం



భూ సమస్యలపై సమీక్షిస్తున్న అధికారులు

కోటవురట్ల,సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): రైతులు భూమి వివాదాల పరిష్కారం కో సం శనివారం మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ తిరుమలబాబు అధ్యక్షతన మండల లెవెల్ కో- ఆర్డినేషన్ కమిటీ సమావేశం జరిగింది. మండలంలోని రాజుపేట సుంకపూర్, అన్నవరం గ్రామాలకు చెందిన పలువురు రైతుల భూ సమస్యలను తెలుసుకుని విచారణ చేపట్టారు. ఇరువర్గాలు వా దనలు అధికారులు విన్నారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. నాలుగు భూ సమస్యల్లో ఒకటి పరిష్కారం కాగా, మిగతా మూడు కేసులను వాయిదావేశారు. ఈ సమావేశంలో డీటీ రమేష్ అన్నవరం వీఆర్‌వో ఆశా, పోలీసులు పాల్గొన్నారు.

వాలీబాల్ కోర్టు ఏర్పాటుకు స్థల పరిశీలన

నక్కపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో త్వరలో వాలీబాల్ కోర్టు ఏర్పాటు చేయనున్నట్టు ఎంపీడీవో డీ సీతారామరాజు చెప్పారు. నక్కపల్లి లైబ్రెరీకి ఆనుకుని వున్న స్థలాన్ని శనివారం గుర్తించారు. హోం మంత్రి అనిత ఆదేశాల మేరకు జిల్లా క్రీడావిభాగం అధికారులు వాలీబాల్ కోర్టును యువకుల కోసం నిర్మిస్తారని ఆయన చెప్పారు. డిప్యూటీఎంపీడీవో చలపతిరావు, సర్వేయర్, హైస్కూల్ పీడీ, సెక్రటరీ ఉన్నారు.

పంచాయతీ స్థలాల ఆక్రమణపై విచారణ: డీపీవో

▸ అక్రమ లే అవుట్లలో ప్లాట్లు క్రయవిక్రయాలు జరపకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు



రాజుగారిబీడులోని పంచాయతీ స్థలంలో బోర్డు ఏర్పాటుచేస్తున్న దృశ్యం

పాయకరావుపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) పాయకరావుపేట పంచాయతీలో వేసిన అక్రమ లే అవుట్లు, పంచాయతీ స్థలాల ఆక్రమణలపై విచారణచేపడుతున్నట్టు జిల్లా పంచాయతీ అధికారి సందీప్ తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ అధికారులతో ఆక్రమణలు ఇతర అంశాలపై చర్చించారు. పంచాయతీ స్థలాలు ఆక్రమణకు గురవుతుంటే ఏం చేస్తున్నారని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లే అవుట్లలో పంచాయతీ స్థలాలను గుర్తించి బోర్డులు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. అనంతరం పట్టణంలో పలు లేఅవుట్ల లోని పంచాయతీ స్థలాలను పరిశీలించారు. దేవినగర్, రాజుగారిబీడులోని పంచాయతీ స్థలాల్లో బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఆక్రమణకు గురైన పంచాయతీ స్థలాలను స్వా ధీనం చేసుకుని వాటిలో కూడా హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేస్తామన్నారు. మండల పరిధిలోని పలు గ్రా మాల్లో ఇప్పటి వరకు 88 లేఅవుట్లు ఉన్నట్టు గుర్తించామని, వీటిలో అత్యధికంగా అక్రమ లేఅవుట్లేనన్నారు. వీరంతా వీఎంఆర్డీఏ నిబంధనలకు అనుగుణంగా క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్)కు ఈ నెలాఖరు వరకు అవకాశం ఉందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ మూర్తి, ఎంపీడీఓ ఎ.జయప్రకాశరావు, డిప్యూటీ ఎంపీడీఓ కె.డేవిడ్, సిబ్బంది వరహాలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్. రాయవరం: అనధికారంగా లేఅవుట్‌లు వేసినట్టయితే చర్యలు తప్పవని డీపీవో సందీప్ హెచ్చరించారు. మండలంలోని పెదగుమ్ములూరు, తిమ్మాపురం పంచాయతీల్లో శనివారం వేసిన పలు లేఅవుట్‌లు పరిశీలించారు. అనధికార లేఅవుట్ల కు నోటీసులు జారీ చేయాలని కార్యదర్శులకు ఆదేశించారు. డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, కార్యదర్శులు ప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనాలు



పాయకరావుపేటలో వినాయక నిమజ్జనం ఊరేగింపు

పాయకరావుపేట, సెప్టెంబరు 6 ఆంధ్రజ్యోతి: పట్టణంలో శనివారం వి గ్రహల నిమజ్జన ఊరేగింపు కార్యక్రమాలు అంతరంగ వైభవంగా జరిగాయి. చివరి రోజు స్వామివారికి ప్రత్యేక పూజలు అనం తరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో విగ్రహాలను ఊరేగించారు. అనంతరం తాం డవ నదిలో విగ్రహాలను నిమజ్జనం చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేసినట్టు సీఐ జి.అప్పన్న తెలిపారు.

పాయకరావుపేట రూరల్: మండలంలోని సత్యవరం, మంగవరం, పెదరాంభద్రపురం, అరట్లకోట, మాసాహెబ్‌పేట తదితర గ్రామాల్లోని వినాయక విగ్రహాలను తాండవ నదిలో నిమజ్జనం చేశారు. పెంటకోట, రాజవరం, వెంకటనగరం, రాజానగరం, పాల్మన్‌పేట, ఈదటం, పాల్తేరు, తదితర చోట్లవిగ్రహాలను సముద్రంలో అనుపు చేశారు. యువకులు, పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

ఎస్. రాయవరం: మండల కేంద్రంతోపాటు పలు గ్రా మాల్లో ప్రతిష్ఠించిన వినాయక నిమజ్జన మహోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. 11 రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి 11వ రోజు నిమజ్జనం చేశారు. ఈసందర్భంగా పలు సాంస్కృతిక ప్రదర్శనల మధ్య ఊరేగించి అనంతరం సమీపంలో ఉన్న చెరువుల్లో నిమజ్జనం చేశారు.

వర్షానికి కూలిన ఇంటి గోడ



పెనుగొలు రేకుల షెడ్ గోడ

ఎస్. రాయవరం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం సుమారు గంటకు పైగా భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి పెనుగొల్లు గ్రామానికి చెందిన కర్రి జోగయ్య, దుర్గ దంపతులకు చెందిన రేకుల షెడ్‌కు చెందిన గోడ నానిపోయి పక్కన ఉన్న మరో ఇంటి ప్రహరీ గోడపై కూలింది. గోడ బయటవైపు కూలడంతో పెద్ద ప్రమాదం తప్పినట్టయింది. ఇంటి గోడ కూలి నష్టపోయిన తమను ఆదుకోవాలని జోగయ్య, దుర్గ దంపతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

'పేట' మండలంలో 265 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ

▸ తహశీల్దారు మహేశ్వరరావు

పాయకరావుపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ ఖరీఫ్‌లో ఇప్పటి వరకు 265 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీచేసినట్టు తహసీల్దారు ఎస్ఏ మహేశ్వరరావు తెలిపారు. శనివారం ఎంపీడీఓ ఎ.జయప్రకాశరావు, ఏఓ ఆదినారాయణ తదితరులతో కలిసి పాయకరావుపేట పీఏసీఎస్‌తోపాటు నామవరం, గుంటపల్లి తదితర గ్రామాల్లో ఆర్ఎస్‌కే, ప్రైవేటు డీలర్లవద్ద యూరియా నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మండలంలో ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 2,635 హెక్టార్లలో వరి సాగు లక్ష్యం కాగా,ఈ ఏడాది 2,300 హెక్టార్లలో నాట్లు పూర్తయ్యాయన్నారు. ఈ రైతులకు ఇప్పటి వరకు 265 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేసినట్టు చెప్పారు. ప్రస్తుతం మండలంలో 24 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని, రానున్న రెండు వారాలకు మ రో 140 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరాకి ఇండెంట్ పెట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ త్రినాద్ తదితరులున్నారు.

నానో యురియా వినియోగంపై అవగాహన

కోటవురట్ల: మండల కేంద్రం, యండపల్లి గ్రామాల్లో నానో యు రియా బయోఫర్టిలేజర్ వినియోగంపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. వ్యవసాయశాఖ అధికారి సరోజని ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎకరానికి 500 ఎంఎల్ నానో యూరియా ద్రావరణం 200 లీటర్ల నీటిలో కలిపి పంటలో పిచికారీ చేయాలన్నారు.

సక్రమంగా యూరియా పంపిణీ చేయాలి

ఎస్. రాయవరం: రైతు సేవా కేంద్రాలతో పా టు ఎరువుల దుకాణాల్లో సక్రమంగా యూరియా పంపిణీ చేయాలని మండల ప్రత్యేక అధికారిణి మనోరమ ఆదేశించారు. మండలంలోని పెదగుమ్ములూరు, సర్వసిద్ధిల్లో యూరియా పంపిణీని తహశీల్దార్ రమేష్‌బాబు, ఎంపీడీవో సత్యనారాయణ, ఏవో సౌ జన్యలతో కలిసి ఆమె పరిశీలించారు.



పాయకరావుపేట పీఏసీఎస్‌లో యూరియా నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు


ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం



దేవవరంలో శాస్త్రిని సత్కరిస్తున్న గ్రామపెద్దలు

నక్కపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవవరం గ్రామం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు డీఆర్‌కే శాస్త్రి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందడంతో శనివారం గ్రామపెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను పలువురు కొనియాడారు. అనంతరం సీనియర్ హెచ్ఎం వేమగిరి నూకరాజు, సర్పంచ్ రాఘవకుమారి, గొర్లె నర్సింహమూర్తి, వియ్యపు వరహాలు, పంపనబోయిన వెంకట్రావ్, పూర్వపు విద్యార్థులు సత్కరించి, జ్ఞాపికలను బహూకరించారు.

మన మిత్ర వాట్సాప్ ద్వారా 161 సేవలు: ఎంపీడీవో



శ్రీరాంపురంలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మన మిత్ర వాట్సాప్ ద్వారా అందిస్తున్న సుమారు 161 పౌర సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఎ. జయప్రకాశరావు సూచించారు. మండలంలోని శ్రీరాంపురంలో శనివారం ఆయన గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజలకు అవగాహన కార్యక్రమం శనివారం మండలంలో అన్ని గ్రామాలలో నిర్వహించినట్టు చెప్పారు. విద్యుత్ బిల్లులు , నివాసితుల బు కింగ్‌లు, సేవలకు వాట్సాప్‌లోని యూపీఐ, క్రెడిట్, డెబిట్ కార్డుల ద్వారా నేరుగా చెల్లించవచ్చునని తెలిపారు. వాట్సాప్‌లో ఫోన్: 95523 00009కు హాయ్ అని పంపడం ద్వారా మన మిత్రను యాక్సెస్ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వై.వి.సత్యనారాయణ, ఎంపీహెచ్ఈవో రమణ, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

'పేట' ఎంపీడీఓ, ఏఓలకు పదోన్నతి

పాయకరావుపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పాయకరావుపేట ఎంపీడీఓ, కార్యాలయ ఏఓలు బదిలీ అయ్యారు. ఎంపీడీవో ఎ.జయప్రకాశరావుకు డీఎల్‌డీఓగా ప్రమోషన్‌పై అల్లూరి సీతా రామరాజు జిల్లా పాడేరుకు, కార్యాలయ ఏవోగా పనిచేస్తున్న సీహెచ్. రవికుమార్‌వర్మకు ఎంపీడీఓగా తూర్పు గోదావరి జిల్లాకు బదిలీ చేస్తూ శనివారం రాష్ట్ర సచివాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

సమష్టిగా పట్టణం అభివృద్ధి

▸▸ జీవీఎంసీ జోనల్ అధికారులు సమీక్షలో ఎమ్మెల్యే కొణతాల ఆదేశం

▸▸ కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని సూచన



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణాభివృద్ధికి అందరూ సమష్టిగా పనిచేయాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ జీవీఎంసీ జోనల్ అధికారులను ఆదేశించారు. శనివారం ఇక్కడ జోనల్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. అనకాపల్లిలో కుక్కల బెడద అధికంగా ఉందని, దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, మెప్మా, పబ్లిక్ హెల్త్, ఉద్యానవన విభాగాలతో విడివిడిగా సమీక్ష నిర్వహించి అభివృద్ధికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి, ఈఈ ఎస్.శేఖర్, ఇన్‌చార్జి ఆర్‌వో రమణ, ఇన్‌చార్జి ఏసీపీ వెంకటరావు, టీపీవో కనకారావు, శానిటేషన్ సూపర్‌వైజర్ రవికుమార్, ఉద్యానవన శాఖాధికారిణి ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రాలు పంపిణీ



రొంగలివానిపాలెంలో మంజూరు పత్రం అందిస్తున్న పీలా గోవింద

కొత్తూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. మండలంలోని రొంగలివానిపాలెం, కూండ్రం, కశింకోట మండలం వెదురుపర్తి, జీవీఎంసీ 81వ వార్డు పూడిమడక రోడ్డులలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి శనివారం ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు పత్రాలు పంపిణీ చేసి మాట్లాడారు. అనారోగ్యంతో ఉన్న ఎందరికో కూటమి అధికారంలోకి వచ్చాక మెరుగైన వైద్య సేవల నిమిత్తం సీఎం సహాయ నిధిని అందజేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పచ్చికూర రాము, మరపురెడ్డి సత్యనారాయణ, రొంగలి సూరిబాబు, పోలిన జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

'ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి'



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు

తుమ్మపాల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల తొమ్మిదవ తేదీన జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పెదిరెడ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సీపీఐ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడంతో ఆటో కార్మికులు ఉపాధి కోల్పోయారన్నారు. దీంతో వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు వాపోయారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఆటో కార్మికులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు కోరిబిల్లి జగదీష్, బాపునాయుడు, మార్కెండేయులు, వెంకటేశ్వరరావు, కె.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటు నిలిపివేతపై హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నాయకుడు మంగా ఈశ్వర్

కొత్తూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లిలోని వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఆలయానికి కూతవేటు దూరంలో ఉన్న థియేటర్ ప్రాంగణంలో బార్ అండ్ రెస్టారెంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ఫ్లెక్సీని ఏర్పాటు చేయడాన్ని ఆ ప్రాంత ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. అంతేకాకుండా ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ దృష్టికి తీసుకు వెళ్లారు. ఆయన వెంటనే స్పందించి అక్కడ బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాట్లను నిలిపివేయాలని సూచించారు. దీంతో వేల్పులవీధి ప్రాంత మహిళలు, యువకులు, జనసేన నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 83వ వార్డు జనసేన ఇన్‌చార్జి మంగా ఈశ్వర్, టీడీపీ వార్డు ఇన్‌చార్జి బొద్దపు ప్రసాద్ మట్లాడుతూ సమస్యను వెంటనే పరిష్కరించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఆలయ చైర్మన్ గరికి వెంకట్రావు, ఎన్టీఆర్ ఆసుపత్రి డైరెక్టర్ గొర్లి శేఖర్, 82వ వార్డు కన్వీనర్ ఆళ్ల రామచంద్రరావు, జనసేన నాయకులు తాడి రామకృష్ణ, టీడీపీ నాయకులు వెదుళ్ళ బాలాజీ, వాకాడ మదన్, సురభి హరీష్, చిన్న, అన్వేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో ఇ-సేవా కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జస్టిస్ రఘునందనరావు

విశాఖపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టులో ఇ-సేవా కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రావు రఘు నందన రావు ప్రారంభించారు. ఈ కోర్టు ప్రాజెక్టులలో భాగంగా విశాఖ జిల్లా కోర్టులో ఇ-సేవా కేంద్రం ఏర్పాటైంది. దీనిని శనివారం జస్టిస్ రావు రఘునందనరావు ప్రారంభించారు. న్యాయ వ్యవస్థలో డిజిటల్ అంతరాయాన్ని తగ్గించి న్యాయం అందరికీ అందుబాటులో ఉండేలా చేయటమే ప్రధాన లక్ష్యంగా దీన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా కేసుస్థితి, తదుపరి విచారణ తేదీ, ఇతర వివరాలు, విచారణలు నిర్వహించటం, ఆండ్రాయిడ్ ఐవోఎస్‌ల కోసం ఈ కోర్టుల మొబైల్ యాప్‌లను డౌన్‌లోడ్ చేయటం, సహాయం చేయటం, ఉచిత న్యాయసేవలు ఎలా పొందాలో మార్గనిర్దేశం చేయడం జరుగుతుందన్నారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ చీమలపాటి రవి, చల్లా గుణ రాజన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజా, పలువురు న్యాయ మూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.





అనకాపల్లి పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో కొలువుదీరిన గణపతి విగ్రహాల నిమజ్జనానికి ఊరేగింపుగా తీసుకు వెళుతున్న భక్తులు

వెళ్లి రావయ్యా.. వినాయక

▸▸ ఘనంగా ముగిసిన గణపతి నవరాత్రి ఉత్సవాలు ▸▸ వీధివీధినా కొలువుదీరిన స్వామి విగ్రహాలను మేళతాళాలు.. కోలాటాల నడుమ చెరువులు, నదుల్లో నిమజ్జనం



ఉగ్గినపాలెంలో గణపతిని దర్శించుకుంటున్న జనసేన నేత రాంకీ



శారదా నదిలో విగ్రహాల నిమజ్జనోత్సవం





సబ్బవరం మండలం అంతకాపల్లిలో చొక్కాకుల పూజలు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వినాయక నవరాత్రి ఉత్సవాలు ముగిసిన నేపథ్యంలో స్వామివారి విగ్రహాల నిమజ్జనోత్సం శనివారం కోలాహల వాతావరణంలో సాగింది. ఇందులో భాగంగా అనకాపల్లి పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో కొలువుదీరిన స్వామి విగ్రహాలను మేళతాళాలు, బాజా భజంత్రీ నడుమ మెయిన్‌రోడ్డు మీదుగా ఊరేగింపుగా తీసుకు వెళ్లి శారదా నదిలో నిమజ్జనం చేశారు. రాత్రి పది గంటల వరకు ఈ వేడుక సాగుతూనే ఉంది. జీవీఎంసీ అధికారులు ఏర్పాటు చేసిన క్రేన్, సిబ్బంది సహాయంతో భారీ విగ్రహాలను నది మధ్యలో నిమజ్జనం చేశారు. పత్రిలు, ఇతర పూజా సామగ్రి నదిలో వేయకుండా జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బందిని అక్కడ నియమించి భారీ వాహనంలో వేయించి వేరే ప్రాంతానికి తరలించారు. నది ప్రవాహం ఉధృతంగా ఉండడంతో ముందస్తు చర్యల్లో భాగంగా అధికారులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. వాటిని దాటి ఎవరూ లోపలికి వెళ్లకుండా పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్, ఎస్ఐల పర్యవేక్షణలో సిబ్బంది పక్కాగా ఆంక్షలను అమలు చేశారు. సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ వ్యవస్థాపక చైర్మన్ ఆడారి కుమారస్వామి, ఆమ్ ఆద్మీ జిల్లా కన్వీనర్ కొణతాల హరినాథబాబులు ఎప్పటికప్పుడు భక్తులను అప్రమత్తం చేశారు. చిన్న విగ్రహాలను తీసుకువచ్చిన వారి నుంచి వాటిని తీసుకొని నదిలో నిమజ్జనం చేయించారు. అలాగే, డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో కొలువుదీరిన స్వామి విగ్రహాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. తొలుత కళాశాల వ్యవస్థాపకులు దాడి వీరభద్రరావు, పద్మావతి దంపతులు, చైర్మన్ దాడి రత్నాకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోలాటాల మధ్య ఊరేగింపు జరిపారు. విద్యార్థులు కూచిపూడి, భరతనాట్యం, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడిచేశారు. అనంతరం కళాశాల ఆవరణలో ఉన్న బావిలో విగ్రహాన్ని రత్నాకర్ నిమజ్జనం చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గణేష్‌రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు. అదేవిధంగా తుమ్మపాలకు వెళ్లే మార్గంలోని ఏలేరు కాలువ వద్ద కూడా భారీ ఎత్తున వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు.

ఇదిలావుంటే, ఇక్కడి ఎన్టీఆర్ స్టేడియంలో సంపత్ వినాయక ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన 126 అడుగుల భారీ గణనాథుడ్ని నర్సీపట్నం డీఎస్పీ పోతురెడ్డి శ్రీనివాసరావు, సుధ దంపతులు శనివారం దర్శించుకున్నారు. తొలుత వీరికి కమిటీ కన్వీనర్ బుద్ధ భూలోకనాయుడు స్వాగతం పలికి దగ్గరుండి స్వామికి పూజలు చేయించారు. అనంతరం డీఎస్పీ దంపతులు వేల్పులవీధి గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్నారు. నూకాంబిక ఆలయ మాజీ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, న్యాయవాది బుద్ధ చిరంజీవి, రవ్వా శ్రీను, వేగి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు : గవరపాలెం విల్లూరి జోగినాయుడు వీధిలో కొలువుదీరిన వినాయక విగ్రహం అనుపోత్సవం వైభవంగా జరిగింది. తొలుత పెద్దలు, పిల్లలకు స్వామికి పూజలు జరిపిన అనంతరం పురవీధుల గుండా ఊరేగింపుగా తీసుకు వెళ్లి శారదా నదిలో నిమజ్జనం చేశారు.

కశింకోట : మండలంలోని ఉగ్గినపాలెంలో కొలువుదీరిన గణపతిని జనసేన అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శోభాయాత్రకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కూటమి నాయకులు కర్రి సత్యనారాయణ, కలిగట్ల సింహాద్రి, కన్నూరు నరసింహనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా అన్న సమారాధనలు

తుమ్మపాల : వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం పలుచోట్ల అన్నసమారాధనలు జరిపారు. ఇందులో భాగంగా తుమ్మపాల మైలురాయి వద్ద ఏర్పా టైన ఈ కార్యక్రమాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి బాబి ప్రారంభించారు. తొలుత స్వామిని దర్శించుకున్నారు ఈ కార్యక్రమంలో మాటూరి జగ్గారావు, గొంతిన శ్రీనివాసరావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని అంతకాపల్లి, గుల్లేపల్లి, ఆరిపాక, సబ్బవరం, లగిశెట్టిపాలెం, మొగలిపురం తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మం డపాల వద్ద శనివారం అన్న సమారాధనలు జరిపారు. అంతకాపల్లిలో వీకేవీసీపీ ఐఆర్ మాజీ చైర్‌పర్సన్ చొక్కాకుల వెంకట్రావు, గుల్లేపల్లి, మొగలిపురంలలో వైసీపీ నేత గండి రవికుమార్ స్వామి వారిని దర్శించుకున్న అనంతరం అన్నసమారాధనలను ప్రారంభించారు. సాయంత్రం మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ విగ్రహాలను ఊరేగించి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు మిడతాడ మహాలక్ష్మీనాయుడు, సర్పంచ్ బండారు శ్రీను, మాజీ సర్పంచ్ రొంగలి దేముడు, జక్కాన సూర్యనారాయణ, ఎస్.నరసింహమూర్తి, కృష్ణంనాయుడు, యడ్ల నాయుడు, గజ్జి నర్సింగరావు, సిరపురపు వాసు, కిల్లి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో మహిళలకు భద్రత తప్పనిసరి

▸▸ మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా పీడీ సూర్యలక్ష్మి



సదస్సులో మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మి

పరవాడ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమల్లో పనిచేస్తున్న మహిళలకు యాజమాన్యాలు తప్పనిసరిగా భద్రత కల్పించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.సూర్యలక్ష్మి సూచించారు. ఇక్కడి రాంకీ ఫౌండేషన్ కమర్షియల్ హబ్‌లో మహిళా ఉద్యోగులు, కార్మికులకు శనివారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. మహిళా చట్టాలపై ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళల భద్రతకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. భద్రత విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా తక్షణమే అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. బాల్య వివాహాలు జరగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సబ్బవరం ప్రాజెక్టు సీడీపీవో కె.లలితకుమారి, ఎస్ఐ మహాలక్ష్మి, మహిళా సంక్షేమ శాఖ అధికారులు కేఎంవీ మంజులావాణి, కేఎల్ మనోహర్, పద్మావతి, ఫార్మా పరిశ్రమ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

భారత్ ఉత్పత్తులపై అమెరికా సుంకాలు పెంచడం దారుణం

▸▸ ట్రంప్ నిర్ణయాలను కేంద్రం తక్షణమే తిప్పికొట్టాలి

▸▸ సీపీఐ, సీపీఎం నాయకుల డిమాండ్



నెహ్రూచౌక్‌లో నిరసన తెలియజేస్తున్న సీపీఐ, సీపీఎం శ్రేణులు

తుమ్మపాల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : భారత్ నుంచి అమెరికాకు ఎగుమతయ్యే వ్యవసాయ, ఇతర ఉత్పత్తులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యాభై శాతం టారిఫ్‌తో సుంకాలను పెంచడం దారుణమని సీపీఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు అన్నారు. డొనాల్డ్ ట్రంప్ గుత్తాధిపత్యానికి వ్యతిరేకంగా శనివారం పట్టణంలోని నెహ్రూచౌక్‌లో గల అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఐ, సీపీఎం నాయకులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికాకు అధ్యక్షులైన వారెవరూ ఇలాంటి నియంతృత్వ ధోరణిని అవలంభించ లేదన్నారు. కానీ ట్రంప్ మాత్రం భారత్‌పై అక్కసుతో ఎగుమతులపై సుంకాలు విధిస్తూ ఇబ్బందులు కలిగిస్తున్నారని మండిపడ్డారు. ఈ కారణంగా అన్ని రాష్ట్రాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో కూడా పెద్ద సంఖ్యలో ఆక్వా రైతులు, జౌలు పరిశ్రమ కార్మికులు, రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ట్రంప్ నిర్ణయాలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే తిప్పికొట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాజాన దొరబాబు, తాకాశి వెంకటేశ్వరరావు, వైఎన్ భద్రం, సీపీఎం నాయకులు పెంటకోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్లుగా తాగు నీరు వృథా

▸▸ అచ్యుతాపురం సెజ్‌కు తాగు నీటిని సరఫరా చేసే పైప్‌లైన్‌కు బొట్టవానిపాలెం ప్రధాన రహదారి వద్ద రంధ్రం

▸▸ పట్టించుకోని ఏపీఐఐసీ అధికారులు

▸▸ మండిపడుతున్న స్థానికులు



పైప్‌నకు రంధ్రం ఏర్పడడంతో పైకి పోతున్న నీరు



రహదారి వెంబడి వృథాగా పారుతున్న నీరు

పరవాడ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అచ్యుతాపురం సెజ్‌కు తాగు నీటిని సరఫరా చేసే పైప్‌లైన్‌కు మండలంలోని రావాడ పంచాయతీ పరిధి బొట్టవానిపాలెం ప్రధాన రహదారికి ఆనుకొని రంధ్రం పడింది. దీంతో నీరు వృథా అవుతోంది. ఏలేరు కాలువ నుంచి తాడి వద్ద గల ఏపీఐఐసీ పంప్‌హౌస్ ద్వారా సెజ్‌కు నీటి సరఫరా జరుగుతోంది. అయితే రెండేళ్ల క్రితం ఎలమంచిలి- గాజువాక ప్రధాన మార్గంలో బొట్టవానిపాలేనికి చెందిన కారుకొండ కన్నయ్య ఇంటికి సమీపంలో భూమి అడుగు భాగాన పైప్‌లైన్‌కు రంధ్రం ఏర్పడింది. నాటి నుంచి పెద్ద ఎత్తున నీరు వృథాగా పోతోంది. ప్రధాన రహదారి గుండా నీరు పారుతూ సమీపంలోని వ్యవసాయ భూమిలోకి చేరుతోంది. అయినప్పటికీ ఏపీఐఐసీ అధికారులు స్పందించక పోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తాగునీటి వృథాకు అడ్డుకట్ట వేయడంతో పాటు పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



ఎస్సీ కాలనీలో శిథిలావస్థకు చేరిన ట్యాంకు

ఇరువాడలో శిథిలావస్థకు చేరిన నీటి పథకం ట్యాంకు

▸▸ చాలీచాలని నీటితో బీసీ, ఎస్సీ కాలనీవాసులకు ఇబ్బందులు

▸▸ పట్టించుకోని అధికారులు



బీటలు వారిన ట్యాంకు పిల్లర్

సబ్బవరం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇరువాడ ఎస్సీ, బీసీ కాలనీ వాసులకు రక్షిత మంచి నీటిని అందించే పథకం ట్యాంకు శిథిలావస్థకు చేరింది. పిల్లర్లు బీటలు వారడంతో ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. రెండున్నర దశాబ్దాల క్రితం ఎస్సీ కాలనీలో ప్రభుత్వం అప్పుడున్న జనాభా అవసరాలకు అనుగుణంగా దీని నిర్మాణాన్ని చేపట్టింది. ఇరువాడ గ్రామ సమీపంలో పంప్ ఏర్పాటు చేసి, కాలనీలో ట్యాంక్ నిర్మించారు. అప్పటి నుంచి ప్రజలు ఇదే రక్షిత మంచి పథకం నీటిని వినియోగిస్తున్నారు. దీని నిర్వహణను పట్టించుకోక పోవడంతో ప్రస్తుతం ఇది శిథిలావస్థకు చేరుకుంది. పంప్ హౌస్ నుంచి ట్యాంక్‌కు వేసిన పైపులు కూడా పలుచోట్ల లీకులు ఏర్పడ్డాయి. దీంతో నీరు వృథాగా పోతోంది. కాలనీ వాసులు తాగునీరు చాలక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకు వెళ్లినా సమస్య పరిష్కారం కావడం లేదని నివాసితులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన ట్యాంకు స్థానంలో కొత్తగా ప్రస్తుత జనాభాకు అనుగుణంగా నిర్మాణం చేపట్టాలని ఆయా కాలనీ వాసులు కోరుతున్నారు.

స్మార్ట్ కార్డులతో పారదర్శకంగా రేషన్ పంపిణీ

▸ చింతపల్లికి 21,394 కార్డులు

చింతపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో 53 డీఆర్ డిపోల పరిధిలో 21,394 కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులు మంజూరైనట్టు స్థానిక తహసీల్దార్ జి. ఆనందరావు తెలిపారు. శనివారం మండల కేంద్రంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి లబ్ధిదారులకు తహసీల్దార్ స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డులో ఉన్న క్యూఆర్ కోడ్‌తో రేషన్ అక్రమాలను అరికట్టవచ్చునన్నారు. తొలి ఐదు రోజులు సచివాలయం ఉద్యోగులతో కార్డులు పంపిణీ చేస్తామన్నారు. అనంతరం రేషన్ డీలర్లు, సేల్స్‌మన్‌ల ద్వారా లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ దురియా పుష్పలత, ఎంపీటీసీ సభ్యురాలు జయలక్ష్మి, టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు, నాయకుడు నాగభూషణం, మంగ్లు, ఏఎంసీ డైరెక్టర్లు పెదిరెడ్ల బేతాళుడు, కృష్ణమూర్తి, రేషన్ డీలర్ ఝాన్సీ పాల్గొన్నారు.

హుకుంపేట: స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం తెలిపారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన రేషన్ కార్డుల పంపిణీలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపీపీ కూడారాజుబాబు, డీటీ మోహనరావు తదితరులున్నారు.

పెదబయలుకు 15, 905 కార్డులు

పెదబయలు: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ త్రినాధరావు రేషన్ కార్డులను పంపిణీ చేశారు. మండలంలో గల 39 రేషన్ షాపులకు మొత్తం 15, 905 కార్డులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పూర్ణయ్య, ఎంపీపీ వరహాలమ్మ, వైస్ ఎంపీపీ సోనే, డీటీలు రంగారావు, వెంకటరమణ, ఆర్ఐ పూర్ణయ్య, వీఆర్వోలు పాల్గొన్నారు.

జి.మాడుగుల: స్మార్ట్ రేషన్ కార్డులను మండలంలో భీరం రేషన్ డిపోలో శనివారం లబ్ధిదారులకు సర్పంచ్ మాధుల రత్నకుమారి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అందచేసిన ఈ స్మార్ట్ కార్డులు భద్రంగా ఉంచుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధా న కార్యదర్శి కొఠారి బొంజుబాబు, కూటమి నాయకులు బి.లక్ష్మయ్య, ఎస్.కొండబాబు, అప్పారావు, రాజుపడాల్, చిన్నబ్బాయి, సింహాచలం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



చింతపల్లిలో స్మార్ట్ రేషన్ కార్డులందజేస్తున్న తహసీల్దార్, నాయకులు

అనంతగిరిలో 14, 284...

అనంతగిరి: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో స్మార్ట్ రేషన్‌కార్డులను శనివారం పంపిణీ చేశారు. ఎంపీపీ శెట్టి నీలవేణి, జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు, తహసీల్దార్ వీరభద్రచారి ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలానికి 14,283 కార్డులు వచ్చాయనిన్నారు. క్యూఆర్ కోడ్ ఉన్నందున పారదర్శకతగా పంపిణీకి వీలవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకర్, డీటీ మాణిక్యం, సర్పంచ్ రూతు, జోగులు, మురళి, రోజా, రంజిత్, శామ్, తదితరులు పాల్గొన్నారు.



అనంతగిరి కార్డుల పంపిణీలో ఎంపీపీ, జడ్పీటీసీ తదితరులు



హుకుంపేటలో కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

దుంబ్రిగుడకు 15, 626..

దుంబ్రిగుడ: మండలంలో 15626 స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసినట్టు తహశీల్దార్ త్రివేణీ తెలిపారు. మొత్తం 42 రేషన్ షాపులకు సంబంధించిన కార్డులను సంబంధిత సేల్స్‌మేన్, డీలర్లకు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజు, వీఆర్వో సత్యనారాయణ, టీడీపీ మండల అ ధ్యక్షుడు తుడుము సుబ్బారావు, ఎం. స్వామి, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: స్మార్ట్ రేషన్ కార్డులు స్థానిక తహసీల్దార్ అన్నాజీరావు శనివారం మండల కేంద్రంలో కూటమి నాయకులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. మండలంలో 24 డీఆర్ డిపోలకు స్మార్ట్ రేషన్ కార్డులు తొలివిడతగా వచ్చాయన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కొండలరావు, జనసేనా నాయకులు గొర్లె వీరవెంకట్, వసుపరి ప్రసాద్, వీఆర్వో లింగాలు పాల్గొన్నారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టులతో తీవ్ర నష్టం



గిరిజన శాఖా మంత్రి సంధ్యారాణికి వినతి పత్రం అందిస్తున్న గిరిజన సంఘ నేతలు

అరకులోయ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి):అరకులోయ, అనంతగిరి, హుకుంపేట మండలాల పరిధిలో హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన జీవో 51 ను రద్దు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, హైడ్రోపవర్‌ప్రాజెక్టు వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ మజ్జి సురేశ్, కో-కన్వీనర్ మజ్జి కృష్ణం రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం అరకులోయ ప ర్యటకు విచ్చేసిన గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణికి వినతి పత్రం అందజేశారు. ఎక్కడా గ్రామసభ, పెసా కమిటీలు తీర్మానాలు లేకుండా హైడ్రోపవర్ ప్రాజెక్టు నిర్మాణానికి గ్రామాల్లో సర్వే రాళ్లను ఏర్పాటు చేశారన్నారు. ఈ ప్రాజెక్టుల నిర్మాణాల వల్ల వందలాది గ్రామాల్లో గిరిజనులు వీధిన పడతారన్నారు. తక్షణం ప్రభుత్వం బడా కార్పొరేట్ సంస్థలకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని మంత్రిని కోరారు. ఈ సమావేశంలో బూర్జ ఎంపీటీసీ సభ్యుడు మజ్జిహరి, బొంజిబాబు, సుంకరమెట్ట సర్పంచ్ చినబాబు, మూర్జ పంచాయితీ గ్రామస్తులు, ,పెసాకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గంజాయి వద్దు- అభివృద్ధి ముద్దు

▸ ధారకొండలో ఐదు పంచాయతీల ప్రజలు భారీ ర్యాలీ



ర్యాలీలో మాట్లాడుతున్న సీఐ వరప్రసాద్

సీలేరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గంజాయి వ్యతిరేకంగా శనివారం జీకేవీధి మండలం ధారకొండలో శనివారం ప్రజలు స్వచ్ఛందంగా భారీ ర్యాలీ నిర్వహించారు. ధారకొండలో గుమ్మిరేవుల, దుప్పులవాడ, సీలేరు, ధారకొండ, గాలికొండ, గాలికొండ ఐదు పంచాయతీలకు చెందిన సుమారు 1000 మం ది కి పైగా పాల్గొన్నారు. ఈ చైతన్య ర్యాలీ ధారకొండ వినాయక గుడి ద గ్గర నుంచి హనుమాన్ జంక్షన్ వరకు సాగింది. గంజాయి వద్దు- అభి వృద్ధి ముద్దు పేరిట ప్లకార్డులతో నినాదాలు చేశారు. అనంతరం కమ్యూనిటీ హాల్ సెంటర్ వద్ద సమావేశమయ్యారు. ప్రజల ఆహ్వానం మేరకు జీకేవీధి సీఐ వరప్రసాద్, సీలేరు ఎస్ఐ రవీంద్ర హాజరయ్యారు. సీఐమాట్లాడుతూ దేశాన్ని పట్టి పీడిస్తున్న గంజాయికి వ్యతిరేకంగా స్వచ్ఛందంగా చైతన్య ర్యాలీ నిర్వహించడంపై అభినందించారు. సాంప్రదాయ పంటలపై దృష్టి సారించాలన్నారు.

ఘనంగా అంతర్జాతీయ యువజన దినోత్సవం



పాడేరు- అరకులోయ జాతీయ రహదారిలో 5కే రన్‌లో పాల్గొన్న యువత

పాడేరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యువజన దినోత్స వం పురస్కరించుకుని జిల్లా కేంద్రం పాడేరులో శనివారం యువతకు 5కే రన్ పోటీలు నిర్వహించారు. 30 మంది యువకులు పాల్గొన్నారు. అలాగే ఈ పోటీలో మొదటి, ద్వితీయ తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి జిల్లా క్షయ నివారణాధికారి ఎం.కిరణ్‌కుమార్ బహుమతులు ప్రదానం చేశారు. ట్రైనర్ నాగబాబు, ఫిజికల్ డైరెక్టర్ అప్పారావు, వైద్యులు ఉపేంద్ర, వసంత, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు అభినందనీయం: తహసీల్దార్

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయులు సేవలు అభినందనీయమని స్థానిక తహసీల్దార్ అన్నాజీరావు అన్నారు. శనివారం స్థానిక కేజీబీవీ పాఠశాలలో ఉపాధ్యాయులు గురుపూజోత్సవం నిర్వహించారు. తొలుత ఉపాధ్యాయులను తల్లిదండ్రులు, విద్యా కమిటీ సభ్యులు సన్మానించారు. ఉపాధ్యాయులు తహసీల్దార్, ఎంపీడీవో ఇమ్మానుయేలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కల్యాణ్ రామ్‌ని సత్కరించారు. ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, స్కూల్ కమిటీ చైర్మన్ ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

ఆదివాసీ రైతులకు ఉద్యాన పంటల మొక్కలు పంపిణీ

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యాన పంటల మొక్కలు పంపిణీ చేస్తుందని ఐటీడీఏ కాఫీ మ్యాక్స్ డైరెక్టర్ అడపా విష్ణుమూర్తి తెలిపారు. శనివారం మండలంలోని రింతాడ పంచాయతీ కడుగుల గ్రామంలో సిల్వర్ ఓక్ మొక్కలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాడేరు డివిజన్ పరిధిలో 2026-27లో లక్ష ఎకరాల్లో కాఫీ తోటలు విస్తరించేందుకు కార్యాచరణ ప్రారంభించిందన్నారు. ఈకార్యక్రమంలో మేట్ వంతల బుజ్జిబాబు పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయం జడ్పీ సీఈవో తనిఖీ

అనంతగిరి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయాన్ని జడ్పీ సీఈవో పోలినాయుడు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రికార్డులను పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయానికి ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరుచేయాలని, జడ్పీ సీఈవోకు ఎంపీపీ శెట్టి నీలవేణి వినతిపత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలోని ఎంపీడీవో ప్రభాకర్, జడ్పీటీసీ గంగరాజు, సర్పంచ్ రూతు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

అనంతగిరి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికల-2 పాఠశాలలోని విద్యార్థినులకు ఐసీడీఎస్, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలోని బాల్య వివాహాలు, పోక్సోచట్టంపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ కోళ్ల ఎర్రమ్మ మాట్లాడుతూ.. గ్రామాల్లో బాల్య వివాహాలు జరిగితే చైల్డ్‌లైన్ నంబర్ 1098 సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలోని ఏఎస్ఐ రాజంనాయుడు, సచివాలయం సిబ్బంది సునీత, సంధ్యరాణి, తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల
నైట్‌హాల్ట్ బస్సు సర్వీసు లేక అవస్థలు



ఆర్‌టీసీ జోన్ చైర్మన్ దొన్నుదొరకు
వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నేతలు

జి.మాడుగుల. సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జి.మాడుగుల-విశాఖపట్నం నైట్ హాల్ట్ బస్సు సర్వీసు పునరుద్ధరించాలని విజయనగరం జోన్ ఆర్‌టీసీ ఛైర్మన్ సీవేరి దొన్నుదొరను స్థానిక టీడీపీ నేతలు కోరారు. శనివారం వారు అరకులోయలో ఆయనకు మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో ఈ బస్సు సర్వీసు ఉండడంతో ఎంతో విశాఖపట్నానికి ప్రయాణం సులువుగా ఉండేదని వివరించారు.ఈ సందర్భంగా దొన్నుదొర సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అలాగే స్థానిక రాజకీయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడుసోమెలి చిట్టిబాబు, నాయకులు కె.సింహాచలం, ఎం. లక్ష్మయ్య, ఎం. అప్పారావు, బాబూరావు, నితిన్‌కుమార్ పాల్గొన్నారు.

12న ఉద్యోగ, ఉపాధి కల్పనకు ఎంపికలు



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

కొయ్యూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గిరిజన నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనకు గానూ విశాఖ పోర్టు అథారిటీ వారి ఆధ్వర్యంలో ఈ నెల 12న పాడేరులో ఎంపిక లు నిర్వహిస్తున్నట్టు కొయ్యూరు సీఐ బి. శ్రీనివాసరావు తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ చేసిన నిరుద్యోగ యువతకు వివిధ ప్రైవేటు, ప్రభుత్వ రంగ సంస్థలలో వేర్ హౌస్ ఎ గ్జిక్యూటివ్, ఇన్వెంటరీ క్లర్క్, ఎలక్ట్రీషియన్ ఉద్యోగ, ఉపాధి కల్పనకు గానూ ఉచిత వసతితో కూడిన ప్లేస్‌మెంట్‌కు ఇస్తారన్నారు. శిక్షణ కాలం రెండు నెలలు ఉంటుందన్నారు.

అభివృద్ధికి నిధులు కేటాయించాలని వినతి



మంత్రికి స్వాగతం పలుకుతున్న జీసీసీ చైర్మన్ , టీడీపీ నాయకులు

అనంతగిరి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి):మండలాభివృద్ధికి నిధులు మంజూరుచేయాలని గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని టీడీపీ మండల నాయకులు కోరారు. శనివారం అరకులోయ పర్యటనకు నిమిత్తం వెళుతున్న సంధ్యారాణికి చిలకలగెడ్డ వద్ద జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలి కారు. అనంతరం మండలాభివృద్ధికి నిధులు మంజూరుచేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాలి నరసింహమూర్తి, బిడ్డ లక్ష్మణరావు, పి.నిర్మల, బి.నగేశ్, డి.శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గా నవరాత్రుల ఉత్సవ కమిటీ ఎంపిక



రాజరాజేశ్వరి అమ్మవారి దుర్గ నవరాత్రుల ఉత్సవ కమిటీ

పాడేరురూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పాడేరు ఉమా నీలకంఠేశ్వస్వామి వారి సమేత రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో జరపనున్న దసరా మహోత్సవాలకు ఉత్సవ కమిటీని శనివారం ఎంపిక చేసినట్టు ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడు తెలిపారు. ఈ నెల 22వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ గురువారం వరకు నిర్వహించే ఉత్సవాలను విజయవంతంగా చేపట్టేందుకు ఉత్సవ కమిటీ అధ్యక్షులుగా కొట్టగుళ్లి రామారావు, ప్రధాన కార్యదర్శులుగా యాదగిరి శ్రీనివాసరా వు, కొమ్మోజి వెంకటరమణలనుఎంపిక చేశారు. ఉపాధ్యక్షులుగా కోనేరు శివ, కిముడు ప్రభాకర్, శివరాత్రి శ్రీనివాస్ కుమార్, బీవీఎస్.ముకుందరావు, సిద్ధినాతి కొండలరావు, వంతినిభ రాజుబాబు, పలాస బాలన్న, కోశాధికారులుగా దేశిది బాబూరావు, కొట్టగుళ్లి పోతురాజు, దాసరి నాగు, ముఖ్య కార్యనిర్వాహక సభ్యులుగా వియ్యపు ఏడుకొండలు, డేగ సత్యనారాయణ, బొద్దపు విజయ్, గుడేటి మధు కుమార్, కొర్రా భరత్‌లున్నారు.

9న 'రైతు పోరుబాట'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు విశ్వేశ్వరరాజు,
మత్స్యలింగం, తదితరులు

పాడేరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలపై వైసీపీ ఆధ్వ ర్యంలో ఈనెల 9న రైతు పోరుబాట పేరిట నిరసన కార్యక్రమాన్ని చేపడతామని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు తెలిపారు. తన కార్యాలయంలో శనివారం అరకులోయ ఎమ్మెల్యే రేగం మ త్స్యలింగం, మాజీ ఎమ్మెల్యేలు కె.భాగలక్ష్మి, ఫాల్గుణలతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వం రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడం లేదని, యూరియా సమస్యపై కనీసం పట్టించుకోవడం లేదని ఈసందర్భంగా ఎమ్మెల్యేలు ఆరోపించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ మంగ్లన్నదొర, వైసీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అరకులోయలో 5కే రన్



అరకులోయ మారథాన్‌ను ప్రారంభిస్తున్న జిల్లా లెప్రసీ,
ఎయిడ్స్, టీబీ కంట్రోల్ అధికారి కిరణ్‌కుమార్

అరకులోయ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ యూత్ డే సెలబ్రేషన్స్ సందర్భంగా అరకులోయలో శనివారం జిల్లాస్థాయి 5కే నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ కిరణ్‌కుమార్ ఈమారథాన్‌ను ప్రారంభించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల,మహిళా కళాశాలకు చెందిన ప్రిన్సిపాల్స్ డా.భరత్‌కుమార్ నాయక్, చలపతిరావుల ఆధ్వర్యంలో విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.విజేతలుగా నిలిచిన వారికి బహుమతులతో పాటు డాక్టర్ కిరణ్‌కుమార్ నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంను డిగ్రీ కళాశాల పీడీ అప్పారావు, కళాశాల క్రీడావిభాగం శిక్షకులు నాగబాబు పర్యవేక్షణ జరిపారు. వైద్యులు ఉపేంద్ర, 108 సిబ్బంది ఎయిడ్స్ నియంత్రణ, టీబి నియంత్రణ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

పాడేరులో కుక్కల స్వైర విహారం

▸ ఒక్కరోజే 18 మందికి గాయాలు



కుక్కకాటుతో శనివారం సాయంత్రం ఆస్పత్రికి వచ్చిన బాధితుడు

పాడేరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం పాడేరు, పరిసర ప్రాంతాల్లో గ్రామ సింహాల బెడద అధికమైంది. గతకొన్ని రోజులుగా ఒక మోస్తరుగా ఉన్న సమస్య ఇటీవల మరింత సమస్యాత్మకంగా మారింది. పాడేరు, సక్కలపుట్టు, సేరిబయలు ప్రాంతాలకు చెందిన 18 మందిని శనివారం కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. వారంతా జిల్లా ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్నారు. పాడేరులోని మోదమాంబ కాలనీ, లోచలిపుట్టు, సుండ్రుపుట్టు, నీలకంఠనగర్‌లతోపాటు పాడేరుకు ఆనుకుని వున్న ప్రాంతాల్లోని కుక్కలు స్వైర్య విహారం చేస్తున్నాయి. ఎవరైన ఒంటరిగా తారసపడితే ఒక్కసారిగా దాడి చేస్తున్నాయి. ఇదే పరిస్థితి చిన్న పిల్లలకు ఎదురైతే పెద్ద ప్రమాదమే చోటు చేసుకుంటుదని స్థానిక ఆందోళన చెందుతున్నారు.

నియంత్రణ శూన్యం

కుక్కల నియంత్రణకు ఎవరూ ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదు. దీంతో గుంపులుగా స్వైర విహారం చేస్తున్నాయి. ప్రతి రోజు కనీసం ఐదుగురిపై కుక్కలు దాడి చేస్తున్నాయని, శని, ఆదివారాల్లో 10 నుంచి 20 మంది వరకు బాధితులు ఆస్పత్రి పాలవుతున్నారని బాధితులు తెలిపారు. ఇకనైనా అధికారులు స్పందించిన కుక్కల సమస్యకు పరిష్కారం చూపాలని పలువురు కోరుతున్నారు.



పాడేరులో స్వైర్య విహారం చేస్తున్న గ్రామ సింహాలు

నేత్ర దానానికి ముందుకు రావాలి: డీఎంహెచ్‌వో



వైద్య సిబ్బంది జాతీయ నేత్రదాన పక్షోత్సవాల అవగాహన ర్యాలీ

పాడేరురూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పాడేరు పట్టణంలో శనివారం 40వ జాతీయ నేత్ర దాన పక్షోత్సవాలు సందర్భంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ కార్యాలయం నుంచి జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వరకు శనివారం అవగాన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ కూడలిలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్.టి.విశ్వేశ్వర నాయుడు మాట్లాడుతూ, ప్రతీ ఒక్కరూ నేత్రదానానికి ముందుకు రావాలని కోరారు. అలాగే, నేత్ర దా నంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో వి.మనుప్రియ, జి.జ్యోతికి ప్రథమ, ద్వితీయ బహుమతులను, మెమొంటోలను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.హేమలత దేవి, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ప్రతాప్, నేత్ర వైద్య నిపుణులు డాక్టర్.అనీష్‌బాబు, ఎఎన్ఎం ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ ఓ.శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక మండలంతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న గోమంగి మండల సాధన సమితి సభ్యుడు

పెదబయలు, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): గోమంగిని ప్రత్యేక మండలంగా ప్రకటించాలని మండల సాధన సమితి సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం లింగేటి పంచాయతీ కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 17 పంచాయతీల పరిధిలో పరిపాలన సౌలభ్యంగా ఉన్న గోమంగిని ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేయాలన్నారు. దీని వల్ల వెనుకబడిన మారుమూల గ్రామాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. మండల సాధన కోసం భవిష్యత్తులో జరిగే కార్యక్రమాలకు 17 పంచాయితీల ప్రజలు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల సాధన సమితి సభ్యులు కొమ్మ పద్మనాభం, కొమ్మ బాలరాజు, కొమ్మ పృధ్వీరాజు, గంపరాయి ధనుంజయ్, కృష్ణారావు, సుభాన్, అప్పన్న, నాగరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

▸ ఈగల్ బృందం ఇన్‌స్పెక్టర్ నారాయణరావు



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ నారాయణరావు

చింతపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు డ్రగ్స్, గంజాయికి దూరంగా ఉండాలని ఈగల్ బృందం ఇన్‌స్పెకర్ ఎస్. నారాయణరావు అన్నారు. శనివారం లంబసింగి గిరిజన సంక్షేమశాఖ బాలుర ఆశ్రమ పాఠశాలలో ఈగల్ బృందం డ్రగ్స్ వద్దు బ్రో అనే పేరిట అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయికి అలవాటు పడితే విలువైన జీవితాలు నాశనమైపోతాయన్నారు. విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ డ్రగ్స్, గంజాయిని సేవించరాదన్నారు. అలాగే గంజాయి, డ్రగ్స్ రవాణ, సాగు, సేవించడం చట్టరీత్యా నేరమన్నారు. ఈ కార్యక్రమంలో పీజీహెచ్‌ఎం అప్పలకొండ, హెచ్‌డబ్ల్యూవో వినాయకరావు పాల్గొన్నారు.

వాడవాడలా వినాయక నిమజ్జనోత్సవాలు

చింతపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వినాయక నిమజ్జనం ఊరేగింపు శనివారం కన్నులపండువగా సాగింది. ముత్యాలమ్మవీధి, సకల దేవతల ఆలయాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. సబ్ జైలు వద్ద భారీ అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. సాయంత్రం థింసా నృత్యం, కోలాటంతో వైభవంగా వినాయక విగ్రహాలను ఊరేగించారు. అలాగే తాజంగి రామాలయంవీధిలో భక్తులు ఐదడుగుల మట్టి వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దీనిని ఊరేగింపుగా తీసుకువెళ్లారు. వినాయక విగ్రహాలను చౌడుపల్లి చెరువు, తాజంగి డ్యామ్ వద్ద నిమజ్జనం చేశారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ పెదిరెడ్ల బేతాళుడు, హెచ్‌డబ్ల్యూవో పసుపులేటి వినాయకరావు, వర్తకసంఘం అధ్యక్షుడు జోగేశ్వరరావు, నాయకులు తాటిపాకల నాగేశ్వరరావు పాల్గొన్నారు.



చింతపల్లిలో ఊరేగింపులో
థింసా నృత్యం ప్రదర్శిస్తున్న యువతీ, యువకులు

సీలేరు: నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో స్థానిక మసీద్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ఏర్పాటు చేసిన లడ్డూ వేలం వేశారు. దీనిని జెన్‌కో ఉద్యోగి భవానీశంకర్ రూ. 6 వేలకు దక్కించుకున్నారు. అలాగే, వర్తక సంఘం వినాయక మండపం వద్ద మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఒడిశాకు చెందిన థింసానృత్యాలు, డీజే సౌండ్‌లతోవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం సీలేరు రిజర్వాయర్‌లో విగ్రహాన్ని నిమజ్జనం చేశా రు. నిమజ్జనం సందర్భంగా ఊరేగింపులో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ రవీంద్ర, ఏఎస్ఐ బుజ్జి ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ పోలీసులతో భద్రతా చర్యలు చేపట్టారు.

రూ.42,116కు లడ్డూ వేలం

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో అల్లూరి యూత్ ఆధ్వర్యంలో ఏ ర్పాటు చేసిన వినాయక మండపం నైవేద్యంగా సమర్పించిన స్వామివారి లడ్డూ శుక్రవారం రాత్రి వేలం నిర్వహించారు. 21 కేజీల గణపతి లడ్డూ ప్రసాదం దక్కించుకునేందుకు పలువురు పోటీపడ్డారు. చివరికి స్థానిక జై దుర్గా వర్తక సంఘం రూ.42వేల 116కు లడ్డూను కైవసం చేసుకున్నారు. పాట అనంతరం ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఊరేగింపుగా లడ్డూని తీసుకువెళ్లి వర్తక సంఘం అధ్యక్షులు వసంత కిశోర్‌కు అందజేశారు. లడ్డూ ప్రసాదంను ఆదివారం గ్రామంలో అందరికీ అందిస్తామన్నారు.



సీలేరులో వినాయ నిమజ్జన ఊరేగింపు



ముంచంగిపుట్టులో లడ్డూను తీసుకువెళ్తున్న
జై దుర్గా వర్తకసంఘం అధ్యక్షులు, ప్రతినిధులు



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే రాజు

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

రావికమతం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ గ్రామాలకు చెందిన తొమ్మిది మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను శనివారం పంపిణీ చేశారు. చోడవరం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రాజు వీటిని అందజేశారు. ఎలిశెట్టి రత్నం (మర్రివలస)రూ.61,181, నిట్టా చైతన్య (కన్నంపేట) రూ.1,31,331, దిమిలి ఝాన్సీరాణి (ఒమ్మవరం) రూ.30,786, ముచ్చకర్ల అప్పలనాయుడు (టి.అర్జాపురం)రూ.1,87,848, పసుమర్తి పార్వతి (మేడివాడ) రూ.75,700, బంటు లక్ష్మి (చినపాచిల) రూ.38 వేలు, గమ్మాల భవాని (గుడ్డిప) రూ.74,922, తమ్మిన యామిని (తట్టబంద) రూ.20 వేలు, యర్రంశెట్టి కుమార్ (తట్టబంద) రూ.30 వేలు మొత్తం రూ.6.49 లక్షల చెక్కులను ఆయా లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కోమటి శంకరావు, మాజీ అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, గొంప ఎంపీటీసీ సభ్యుడు గంజి సూర్యనారాయణ, నాయకులు గల్లా నానిబాబు, బంటు శ్రీను, మజ్జి కొండయ్య పాల్గొన్నారు.

అనధికార ల్యాబ్‌లు మూసేయండి

▸▸ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి హైమావతి



ల్యాబ్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో అనధికారికంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ ల్యాబ్‌లను వెంటనే మూసివేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి హైమావతి హెచ్చరించారు. వడ్డాది గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ, ఇమ్యునైజేషన్, ఫార్మసీ రికార్డులను పరిశీలించారు. అలాగే ప్రభుత్వ వైద్య, ఆరోగ్య కార్యక్రమాల వివరాలపై ఆరా తీశారు. ఆనంతరం ప్రైవేట్ ల్యాబ్‌లను పరిశీలించి, ఆర్ఎంపీ వైద్యులతో సమావేశం నిర్వహించారు. ల్యాబ్‌లకు రిజిస్ట్రేషన్‌లు తప్పనిసరిగా చేయించుకోవాలని ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో ఆదేశించారు. అలాగే అనధికారికంగా కొనసాగుతున్న ప్రైవేట్ ల్యాబ్‌లను వెంటనే మూసివేయాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వడ్డాది వైద్యాధికారి రమ్యదుర్గ పాల్గొన్నారు.

అందుబాటులోకి టీవీ చానళ్ల సేవలు

▸▸ బీఎస్ఎన్ఎల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ ఆడమ్



మాట్లాడుతున్న బీఎస్ఎన్ఎల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ ఆడమ్

నర్సీపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ ద్వారా టీవీ చానళ్ల సేవలు అందుబాటులోకి తీసుకువచ్చామని ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ జి.ఆడమ్ తెలిపారు. నర్సీపట్నం బీఎస్ఎన్ఎల్ ఎక్స్ఛేంజ్ కార్యాలయంలో శనివారం డీజీఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 30వ తేదీలోగా కనెక్షన్ తీసుకున్నవారికి రూ.400కే టీవీ చానళ్ల కనెక్షన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ ప్యాకేజీలో 44 పే చానళ్లు, తొమ్మిది ఓటీటీ చానళ్లు వస్తాయన్నారు. బీఎస్ఎన్ఎల్ ద్వారా నాణ్యమైన సేవలు అందిస్తామన్నారు. ఫ్రీడమ్ ఆఫర్ కింద రూ.1కే సిమ్ అందజేస్తున్నామని, ఈ సిమ్ తీసుకున్న వారికి రోజుకు 2 జీబీ ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇంజనీర్లు శ్రీనివాసరావు, బేగం, జగదీశ్వరరావు పాల్గొన్నారు

ఘనంగా మిలాద్-ఉన్-నబీ జయంతి



గ్రామంలో ఊరేగింపులా వెళుతున్న ముస్లిం సోదరులు

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని కృష్ణాదేవిపేటలో శనివారం మహ్మద్ ప్రవక్త జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులంతా మసీదులో వేకువజాము నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లిం సోదరులు ఆచార పద్ధతిలో జెండాలతో గ్రామ పురవీధుల్లో తిరిగారు. ఈ సందర్భంగా హిందూ, ముస్లిం సోదరులు బాయ్ బాయ్ అనే నినాదాలతో ర్యాలీ సాగించారు. కార్యక్రమంలో కరీముల్లా, ఈఎం ఇబ్రహీం, షెక్ రెహమాన్, షెక్ కరీం, షెక్ జిలానీ, రహిమాన్, బాబి, ముస్తాఫా, వల్లి పాల్గొన్నారు.

భారీ గణనాథుడ్ని దర్శించుకున్న డీఎస్పీ



డీఎస్పీ దంపతులకు జ్ఞాపిక అందిస్తున్న కమిటీ కన్వీనర్ భూలోకనాయుడు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో సంపత్ వినాయక ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన 126 అడుగుల భారీ గణనాథుడ్ని నర్సీపట్నం డీఎస్పీ పోతురెడ్డి శ్రీనివాసరావు, సుధ దంపతులు శనివారం దర్శించుకున్నారు. తొలుత వీరికి కమిటీ కన్వీనర్ బుద్ధ భూలోకనాయుడు స్వాగతం పలికి స్వామికి పూజలు చేయించారు. అనంతరం డీఎస్పీ దంపతులు వేల్పులవీధి గౌరీపరమేశ్వరులను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో నూకాంబిక ఆలయ మాజీ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, న్యాయవాది బుద్ధ చిరంజీవి, రవ్వా శ్రీను, వేగి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత వంతెనలపై అసెంబ్లీలో ప్రస్తావిస్తా

▸▸ చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాది, విజయరామరాజుపేటలో శాశ్వత వంతెనల నిర్మాణాల విషయమై అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావిస్తానని చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు చెప్పారు. వడ్డాది, విజయరామరాజుపేట కాజ్‌వేల తాత్కాలిక మరమ్మతులకు స్టేట్ హౌసింగ్ బోర్డు చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబుతో కలిసి శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ శాశ్వత వంతెనల నిర్మాణాలకు వడ్డాదికి రూ.25 కోట్లు, వీఆర్ఆర్ పేటకు రూ.18 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. ఎంపీ సీఎం.రమేశ్, స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుతో చర్చించి, వారి సహకారంతో నిధులు మంజూరు చేయిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ అంశాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఈ రెండు వంతెనల గురించి స్పష్టమైన ప్రకటన వచ్చేలా తన శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ డి.నాగేశ్వరిదేవి, సర్పంచ్ కోరుకొండ కామలక్ష్మి, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు ఎంవీవీ సత్యనారాయణ, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర డైరెక్టర్ ఎస్.శ్రీరామూర్తి, కూటమి నాయకులు దొండా నరేశ్, సన్యాసిరావు, గిరిబాబు, సింగంపల్లి రమేశ్, నానాజీ, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు, చిత్రంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు

భూ సమస్యలు పరిష్కరించాలని ధర్నా

కె.కోటపాడు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడువాడ, పాచిలివానిపాలెం గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. కె.కోటపాడు పురవీధుల్లో భారీగా రైతులు నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి దంతులూరి వర్మ మాట్లాడుతూ మూడు తరాలుగా భూములను సాగు చేస్తున్న రైతులకు పట్టాలు మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. రైతులకు దక్కాల్సిన భూములను కార్పొరేట్లకు అప్పగించడం కోసం కుట్రలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. జిల్లా కార్యదర్శి కోన మోహన్‌రావు మాట్లాడుతూ జిరాయితీ భూములు రెవెన్యూ రికార్డుల్లో నిషేధిత భూములుగా నమోదు చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పట్టాలు ఇవ్వకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ భుజంగరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నవయువ సమాఖ్య రాష్ట్ర నేత నందారపు భాస్కరరావు, రైతు కూలీ సంఘం నాయకులు ఆర్.సూర్యనారాయణ, ఏటుకూరు రాజేశ్, వెంకటరమణ, డి.ఎరుకునాయుడు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న రైతులు, నాయకులు

యూరియా కోసం రైతుల బారులు

రావికమతం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యూరియా విక్రయ కేంద్రాల వద్ద శనివారం రైతులు బారులు తీరారు. నాలుగు రైతు సేవా కేంద్రాల ద్వారా సుమారు 50 టన్నుల యూరియాను పంపిణీ చేశారు. కొత్తకోట పీఏసీఎస్ ద్వారా 12 టన్నులు, గొంప, చినపాచిల, పి.పొన్నవోలు, గర్నికం రైతు సేవా కేంద్రాల ద్వారా పది టన్నుల చొప్పున యూరియాను అందజేశారు. ఒక్కో రైతుకు ఒక్క బస్తా చొప్పున ఇవ్వడంతో రైతులు ఎగబడ్డారు. క్యూలో ఉన్న వారికే యూరియా ఇస్తామని సిబ్బంది తెలపడంతో రైతులు చాంతాడంత క్యూలో బారులు తీరారు. ఉదయం నుంచి రాత్రి వరకూ ఉన్న అందరికీ యూరియా దొరకకపోవడంతో కొంత మంది వెనుతిరిగారు. రైతుల అవసరానికి సరిపడా యూరియా ఇవ్వకుంటే ఎలా అని పలువురు రైతులు మండిపడ్డారు. ఈ విషయమై ఏవో రమేశ్‌ను వివరణ కోరగా, మండలానికి ఖరీఫ్ వరి సాగుకు 409 మెట్రిక్ టన్నుల యూరియా అవసరంగా ప్రతిపాదనలు పంపగా, ఇప్పటికి 385 మెట్రిక్ టన్నులు వచ్చినట్టు చెప్పారు.



కొత్తకోట పీఏసీఎస్ వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

మాడుగులలో మోస్తరు వర్షం

మాడుగుల రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శనివారం మోస్తరు వర్షం పడింది. ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఎండ కాసింది. ఆ తర్వాత వాతావరణంలో ఒక్కసారిగా మార్పు వచ్చింది. ఆకాశమంతా మేఘావృతమై తేలికపాటి జల్లులతో ప్రారంభమైన వాన సుమారు గంటన్నర పాటు మోస్తరుగా పడింది. మాడుగుల పరిసర ప్రాంతంలో కుండపోతగా వర్షం పడడంతో జవ్వాదిగెడ్డ జోరుగా పారింది. లోతట్టు ప్రాంతాల్లో జలమయమయ్యాయి. పలు ప్రదేశాల్లో వర్షం నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. మాడుగుల జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల గేటు ముందు వర్షం నీరు నిలిచిపోవడంతో ఆ నీటిలో నుంచే విద్యార్థులు అవస్థలు పడుతూ బయటకు వచ్చారు.

పీఎం ప్రణామ్ పథకాన్ని వినియోగించుకోండి

దేవరాపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం ప్రణామ్ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి ఎల్‌వై.కాంతమ్మ సూచించారు. మండలంలోని కొత్తపెంట గ్రామంలో శనివారం నానో యూరియా, నానో డీఏపీ డ్రోన్ ద్వారా వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవ సంబంధమైన ఎరువుల వినియోగం గురించి వివరించారు. మండల ప్రత్యేకాధికారి మంజులావాణి, సర్పంచ్ రొంగలివెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

తునివలసలో ప్రత్యేక వైద్య శిబిరం

'చీడికాడ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తునివలస గ్రామంలో శనివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 40 మందికి పరీక్షలు చేశారు. 'తునివలసలో జ్వరాలు' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో శనివారం ప్రచురితమైన కథనానికి గోగాడ వైద్యులు స్పందించారు. ఈ మేరకు వైద్య సిబ్బంది పిల్లల రేవతి, పాసుల శకుంతల, శ్రీనివాసరావు, ఉగ్గిన శకుంతల గ్రామంలో ఇంటింటికీ వెళ్లి జ్వర బాధితులను గుర్తించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పాతాళం బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వడ్డాది వంతెనపై గ్రానైట్ లారీలను నిషేధించాలి

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాదిలో కూలిన వంతెనపై అర్ధ రాత్రి వేళ అధిక బరువుతో గ్రానైట్ లారీలు రాకపోకలు సాగిస్తున్నాయని, వాటిని నిషేధించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కాజ్‌వే కూలిపోవడంతో చిన్నపాటి వాహనాలకు అనుమతిని ఇచ్చిన అధికారులు, సందట్లో సడేమియా అన్నట్టు రాత్రి వేళల్లో అధిక బరువులతో లారీలు రాకపోకలు సాగిస్తున్నాయని అసహనం వ్యక్తం చేశారు. అధిక బరువుతో మూడు గ్రానైట్ లారీలు శనివారం రాత్రి 2 నుంచి 3 గంటల మధ్య బ్రిడ్జి దాటినట్టు స్థానిక ప్రజలు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి అధిక బరువుతో ఉన్న గ్రానైట్ లారీల రాకపోకలు నిషేధించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

రైతు సేవా కేంద్రాల్లో తనిఖీలు

చీడికాడ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు రైతు సేవా కేంద్రాల్లో అధికారులు తనిఖీలు చేపట్టారు. బైలపూడి, జి.కొత్తపల్లి కేంద్రాల్లో తహసీల్దార్ కిశోర్ లింకన్, ఎంపీడీవో హేమసుందరరావు, వ్యవసాయ అధికారి ఎ.కృష్ణవేణితో పాటు కేంద్రాలను పరిశీలించారు. అర్జునగిరి, జి.కొత్తపల్లి రైతు సేవా కేంద్రాల్లో పోలీసుల సమక్షంలో ఎరువులు పంపిణీ చేశారు. సర్పంచులు రమాదేవి, సూరినాయుడు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

బీఎన్ రోడ్డు గోతుల్లో చేపలు పడుతూ నిరసన



కొత్తకోట సమీపంలో నిరసన తెలుపుతున్న నాయకులు

రావికమతం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బీఎన్ రోడ్డులోని గోతుల్లో చేరిన వర్షం నీటిలో సీపీఎం నాయకులు శనివారం చేపలు పడుతూ వినూత్నంగా నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు ఆధ్వర్యంలో కొత్తకోట పెంట్రోల్ బంకు సమీపంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రహదారి దారుణంగా తయారైనా అధికారులు, పాలకులకు చలనం లేకపోవడం దురదృష్టకరమన్నారు. మితిమీరిన బరువులతో ఈ రోడ్లపై తిరిగే భారీ క్వారీ లారీలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడంతోనే ఈ దుస్థితి దాపురించిందన్నారు. చోడవరం మండలం వెంకన్నపాలెం నుంచి రోలుగుంట మండలం వెలంకాయలపాలెం వరకు వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి రోడ్డు అభివృద్ధి పనులు చేట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్.వలసయ్య, పాడి బెన్నయ్య, జోగిరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మార్జిన్‌లో కూరుకుపోయిన లారీ



రోడ్డు మార్జిన్‌లో కూరుకుపోయిన లారీని బయటకు లాగుతున్న ట్రాక్టర్లు

రావికమతం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రానికి ఎరువులు తీసుకొచ్చే లారీ శనివారం రోడ్డు మార్జిన్‌లో కూరుకుపోయింది. మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రాలకు యూరియా ఎరువు లోడుతో ఉదయం వచ్చిన లారీ ముందుగా చినపాచిల రైతు సేవా కేంద్రం వద్ద సగం యూరియా బస్తాలను దించేసింది. మిగిలిన సగం యూరియాను రావికమతం రైతు సేవా కేంద్రం వద్ద దింపేందుకు చినపాచిల నుంచి బయలదేరింది. రావికమతం చెరకు కాటా దాటి రైతు సేవా కేంద్రానికి 200 మీటర్ల దూరంలో ఎదురుగా వచ్చే వాహనాన్ని తప్పించబోయి రోడ్డు మార్జిన్‌లో కూరుకుపోయింది. లారీని పైకి తీసేందుకు ఎంత ప్రయత్నించినా రాకపోవడంతో, చివరికి రెండు ట్రాక్టర్ ఇంజన్లను రప్పించి బయటకు తీశారు. గ్రామంలో వాడుక నీరంతా ఆ ప్రదేశంలో రోడ్డుపై నిల్వ ఉండిపోవడంతో వాహనాలు దిగిపోతున్నాయని గ్రామస్థులు తెలిపారు.

డ్రోన్‌తో నానో యూరియా పిచికారీ



డ్రోన్‌తో నానో యూరియాను పిచికారీ చేస్తున్న దృశ్యం

నర్సీపట్నం అర్బన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మసాగరం గ్రామంలో డ్రోన్ సాయంతో శనివారం నానో యూరియాను పిచికారీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ ఒక ఎకరాకు ప్రస్తుతం 500 ఎంఎల్ చొప్పున నానో యూరియా స్ప్రే చేసుకోవాలని సూచించారు. దీనివల్ల వరి పైరు పచ్చగా ఉంటుందన్నారు. నానో యూరియా స్ప్రే చేయడం వల్ల పైరు ఏపుగా పెరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ, డ్రోన్ పైలెట్ శ్రీనివాస్, వ్యవసాయ సహాయకులు భవానీ, రైతులు పాల్గొన్నారు.

నిషేధిత చేపలు పెంచితే జరిమానా

▸▸ ఫిషరీష్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ నాగమణి



మాట్లాడుతున్న నాగమణి

కె.కోటపాడు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రైవేట్, ఇరిగేషన్ చెరువుల్లో నిషేధిత చేపలు పెంచితే భారీగా జరిమానా విధిస్తామని ఫిషరీష్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ టి.నాగమణి హెచ్చరించారు. కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో ప్రైవేట్ వర్తకులు నిర్వహిస్తున్న చేపల చెరువులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ పరిధిలో ఉన్న మత్స్యకార సొసైటీలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయన్నారు. ప్రతీ సొసైటీకి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తున్నదన్నారు. వంద మంది సభ్యులు ఉన్న వారికి రూ.7 లక్షలు, 35 మంది సభ్యులు ఉన్న వారికి రూ.లక్ష ఆర్థిక సహాయం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ నిధుల ద్వారా చెరువులు అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. ఇరిగేషన్ చెరువుల్లో చేపలు పెంచుకుని విక్రయించుకోవచ్చని చెప్పారు. ఇందుకోసం చెరువుల విస్తీర్ణాన్ని బట్టి ప్రభుత్వానికి శిస్తు కేటాయింపులు ఉంటాయన్నారు. ప్రైవేట్ యాజమాన్యాలు చేపలు పెంపకానికి కోడి వ్యర్థాలు వినియోగిస్తున్నట్టు వచ్చిన ఫిర్యాదు మేరకు 76 చెరువుల యజమానులకు జరిమానా విధించామన్నారు. తన పరిధిలో ఉన్న ఎనిమిది రిజర్వాయర్లలో చేపలు పట్టే వారికి ట్యాంకులు, వలలు, ఐస్ బాక్సులు రాయితీపై అందించామని ఆమె చెప్పారు.

రాజన్నపేట క్వారీ యజమాన్యానికి నోటీసులు జారీ

రోలుగుంట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజన్నపేట నల్లరాయి క్వారీలో అక్రమ బ్లాస్టింగ్, బోర్ బ్లాస్టింగ్ కారణంగా సమీపంలోని ఇళ్లు బీటలువారాయి. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గత నెలలో గ్రామస్థులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే అక్రమ బ్లాస్టింగ్‌పై 'ఆంధ్రజ్యోతి'లో కూడా కథనం వెలువడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తహసీల్దార్ నాగమ్మ శనివారం క్వారీ యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వ భూమితో పాటు చెరువును అక్రమించి అక్రమంగా రోడ్డు నిర్మాణం చేపట్టారని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. దీనిపై ఇప్పటికే జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు ఈ అక్రమ మైనింగ్‌పై ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ నెల 8వ తేదీన క్వారీ నిర్వహణకు సంబంధించి పంచాయతీ తీర్మానం, కాలుష్య నియంత్రమణ మండలి అనుమతులు, ఇండస్ట్రీయల్ వారి అనుమతి పత్రాలతో హాజరు కావాలని క్వారీ యజమానులు బొప్పన చౌదరి, ఏకా వీర్రాజు, పద్మారావు హాజరు కావాలని ఆదేశించారు.

ఫిషరీస్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు స్పాట్ కౌన్సెలింగ్

నర్సీపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఫిషరీస్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం స్పాట్ కౌన్సెలింగ్ చేపడుతున్నామని బీఆర్ ఫిషరీస్ కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3 నుంచి 11వ తేదీ వరకు స్పాట్ కౌన్సెలింగ్ ఉంటుందని చెప్పారు. పదో తరగతి ఉత్తీర్ణత, ఇంటర్ ఫెయిలైన విద్యార్థులు కూడా ఈ కోర్సు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మర్ని వివరాల కోసం 8247371907 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు

నాతవరం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాధికారి సుగుణ హెచ్చరించారు. మండలంలోని గన్నవరంమెట్ట, పికెగూడెంలో ఎరువుల దుకాణాలను శనివారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఎక్కడా యూరియా కొరత లేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్టు చెప్పారు. ఎకరా పొలానికి అర బస్తా యూరియా మాత్రమే ఉపయోగించాలని ఆమె సూచించారు. అధిక మోతాదులో ఉపయోగిస్తే పంటకు తెగుళ్లు సోకే ప్రమాదం ఉందన్నారు. అనంతరం నానో యూరియా ఉపయోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, తాండవ కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

గొలుగొండ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేడ్కర్ గురుకుల కళాశాలలో సీజనల్ వ్యాధులపై శనివారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం వర్షాల సీజన్ కావడంతో జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందని, విద్యార్థులు కాచి ఒడబోసిన నీటినే తాగాలని వైద్యాధికారి శ్యామ్‌కుమార్ సూచించారు. అనంతరం విద్యార్థులకు రక్త, వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కోటీశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కేజే పురంలో యూరియా పంపిణీ

మాడుగుల రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కేజే పురం రైతు సేవా కేంద్రంలో శనివారం 200 యూరియా బస్తాలు రైతులకు పంపిణీ చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీ సభ్యులు తహసీల్దారు రమాదేవి, ఎంపీడీవో అప్పారావు, ఏవో అనసూయ, ఎస్ఐ నారాయణరావు ఆధ్వర్యంలో వీఆరోలు, పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో యూరియా పంపిణీ చేపట్టారు. రైతులకు యూరియా ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. ఏవో అనసూయ మాట్లాడుతూ కేజే పురం గ్రామానికి 44 టన్నుల యూరియా సరఫరా చేయాల్సి ఉందని, ఇప్పటి వరకు 22 టన్నుల యూరియా రైతులకు సరఫరా చేశామని చెప్పారు.మిగిలిన యూరియా మరో రెండు రోజుల్లో అందు. బాటులోకి తీసుకు వస్తామన్నారు. రైతులు నానో యూరియాపై అవగాహన పెంచుకుని వినియోగించాలని సూచించారు.

దేవరాపల్లిలో ఓనం సంబరాలు

దేవరాపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం ఓనం సంబరాలు నిర్వహించారు. కైరళీ ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థినులు కేరళ సంప్రదాయ దుస్తులు, వేషధారణతో ఆకట్టుకున్నారు. కేరళ రాష్ట్రంలో సంప్రదాయంగా జరిగే ఓనం పండగను ఉపాధ్యాయులంతా కేరళ సంప్రదాయ దుస్తులు ధరించగా పిల్లలు వివిధ వేషధారణలతో ఆకర్షణగా నిలిచారు. పూలతో వేసిన ముగ్గులు, మలయాళ జాన పద గేయాలు అలరించాయి. ఎస్ఐ సత్యనారాయణ, ఎంఈఓ ఉమ, కైరళీ ప్రిన్సిపాల్ ఎం.కె.దినేష్ పాల్గొన్నారు.

వెళ్లిరా... గణపయ్యా!


అనకాపల్లి శారదానదిరోడ్డులో గణనాథుడి ఊరేగింపు

ఘనంగా గణనాథుడి విగ్రహాల నిమజ్జనోత్సవం

నవరాత్రుల పూజలందుకున్న గణనాథుడి విగ్రహాల నిమజ్జనోత్సవం శనివారం అంగరంగవైభవంగా సాగింది. గ్రామాల్లో వినాయక ప్రతిమలను మేళతాళాలు, కోలాటాలు, వివిధ రకాల నృత్యాలు, బాణసంచా కాల్పుల మధ్య భారీ ఊరేగింపుతో సాగనంపారు. సమీపంలోని చెరువులు, నదుల వద్దకు చేరుకుని, వినాయకుడికి వీడ్కోలు పలికారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్


అనకాపల్లి శారదా నదిలో క్రేన్ సాయంతో వినాయక ప్రతిమలను నిమజ్జనం చేస్తున్న దృశ్యం


డైట్ కళాశాలలో గణేశుడి నిమజ్జనోత్సవం సందర్భంగా విద్యార్థుల నృత్యాలు


ఎలమంచిలిలో నిమజ్జనోత్సవం సందర్భంగా కోలాటం ఆడుతున్న మహిళలు

13న అనకాపల్లిలో మెగా జాబ్‌మేళా

» బ్రోచర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే కొణతాల


బ్రోచర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 13న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి డాక్టర్ ఎన్.గోవిందరావు తెలిపారు. ఈ మేరకు ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ శనివారం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ పది, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులు జాబ్‌మేళాకు హాజరుకావచ్చన్నారు. 18 నుంచి 35 ఏళ్ల వయసు గల యువతీ యువకులు అర్హులన్నారు. ఆసక్తి గల వారు తమ వివరాలను నైపుణ్యం.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నంబరు, ఆధార్‌కార్డు, విద్యార్హత ధ్రువపత్రాల నకళ్లతో 13వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు హాజరుకావాలన్నారు. మేళాలో సుమారు 25 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు.

ఉపాధ్యాయుల గౌరవం పెంచిన డిప్యూటీ సీఎం

» కృతజ్ఞతలు తెలిపిన సీపీఎస్ఈఏ జిల్లా ప్రధాన కార్యదర్శి


మోటూరు త్రినాథ స్వామి

అచ్యుతాపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పట్ల ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చూపిస్తున్న గౌరవానికి ధన్యవాదాలు తెలుపుతున్నామని ఏపీ సీపీఎస్ఈఏ జిల్లా ప్రధాన కార్యదర్శి మోటూరు త్రినాథస్వామి అన్నారు. ఈ మేరకు శనివారం విలేకర్లతో మాట్లాడుతూ పిఠాపురంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరికీ దుస్తులు బహుమతిగా అందించడం పవన్ గొప్పతనానికి నిదర్శనమన్నారు. గత ప్రభుత్వంలో చాలా మంది ఉపాధ్యాయులు అక్రమంగా సస్పెన్షన్లకు గురయ్యారని, ఇప్పుడు స్వయంగా ఉప ముఖ్యమంత్రి చేతులమీదుగా సత్కారాలు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఓ ప్రజాప్రతినిధి సొంత నిధులతో ఉపాధ్యాయులకు నూతన వస్త్రాలు బహుమతిగా అందించడం దేశ చరిత్రలో ప్రథమమన్నారు. దీంతో సమాజంలో ఉపాధ్యాయుల పట్ల గౌరవం మరింత పెరిగిందన్నారు. గత ప్రభుత్వంలో సీపీఎస్‌పై పోరాడినందుకు తనను సస్పెండ్ చేసి మూడు ఇంక్రిమెంట్లు కట్ చేశారని, ఇంకా ఎంతోమంది తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాతే ఉపాధ్యాయులు సంతోషంగా ఉన్నారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులంతా హక్కుల కోసం పోరాడుతూనే మంచి పనులను స్వాగతిస్తారన్నారు.

కల్తీ ఎరువులు సరఫరా చేసిన వ్యక్తుల అరెస్టు

కె.కోటపాడు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కల్తీ ఎరువుల సరఫరా కేసులో హైదరాబాద్‌కు చెందిన భూమి ఆగ్రో కార్పొరేషన్ రీజనల్ మేనేజర్ కవ్వ శ్రీనివాస్ రెడ్డి, శ్రీవెంకటేశ్వర ఆగ్రోస్ అండ్ ఫెర్టిలైజర్స్ యజమాని ఉమారాణిని పోలీసులు శనివారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. మండలంలోని సంతపాలెంలో గత నెల 24 రాత్రి విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో లారీలో నిషేధిత మిశ్రమ ఎరువులు 600 బ్యాగులు పట్టుబడ్డాయి. విచారణ చేయగా.. హైదరాబాద్ నుంచి వచ్చినట్టు నిర్ధారించారు. నిషేధిత ఎరువులు రైతులను మోసం చేయడానికి సరఫరా చేయడంతో అరెస్టు చేసినట్టు ఎస్ఐ ధనుంజయ్ తెలిపారు. ఎరువుల కొనుగోలు సమయంలో లైసెన్స్ కలిగిన డీలర్ల నుంచే కొనుగోలు చేయాలని, నిషేధిత లేదా నకిలీ ఎరువులను సరఫరా చేస్తే సమాచారం ఇవ్వాలని ఎస్ఐ తెలిపారు.

స్త్రీశక్తి పథకానికి విశేష స్పందన

» ఆర్టీసీ ఈడీ కేఎస్ బ్రహ్మానందరెడ్డి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకానికి మహిళల నుంచి విశేష స్పందన లభిస్తోందని ఆర్టీసీ విజయనగరం జోన్ ఈడీ కేఎస్ బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం ఆయన అనకాపల్లి డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయనగరం జోన్‌లో స్త్రీ శక్తి పథకం ద్వారా ఆగస్టు 31 నాటికి 60.24 లక్షల మంది వివిధ ప్రాంతాలకు ఉచిత ప్రయాణం చేశారన్నారు. దీనివల్ల మహిళలకు రూ.20.26 కోట్లు ఆదా అయిందన్నారు. అనకాపల్లి డిపోలోనే సెప్టెంబరు ఐదో తేదీ వరకు 1,66,117 మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారన్నారు. దీనివల్ల రూ.57,32,638 లబ్ధి చేకూరిందన్నారు. విజయనగరం జోన్‌లో ఆర్టీసీ ఆదాయం మెరుగుపడిందని, మరింత పెరిగే అవకాశాలున్నాయన్నారు. అనకాపల్లి డిపోలో 10,417 మంది విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లు అందజేశామన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌ను అభివృద్ధి చేసేందుకు అధికారులకు ప్రతిపాదనలు పంపామన్నారు. కాంప్లెక్స్ అభివృద్ధికి స్థానిక


డీపీటీవో ప్రవీణా, నర్సీపట్నం డీఎం ధీరజ్‌తో మాట్లాడుతున్న ఈడీ బ్రహ్మానందరెడ్డి

ఎమ్మెల్యే సహకరిస్తున్నారన్నారు. అనకాపల్లిలో శుక్రవారం 104, నర్సీపట్నంలో 90 శాతం ఓఆర్ వచ్చిందన్నారు. ఆయా డిపోల నుంచి అనకాపల్లి కాంప్లెక్స్‌కు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు వచ్చేలా కృషిచేస్తామన్నారు. ఖాళీగా ఉన్న డిపో మేనేజర్ పోస్టును భర్తీ చేస్తామని, ఇప్పటికే డీఎం నియామకానికి చర్యలు తీసుకున్నామన్నారు. ఆయన వెంట ఆర్టీసీ డీపీటీవో వి.ప్రవీణ, నర్సీపట్నం డీఎం ధీరజ్ పాల్గొన్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఉద్యమం

» సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు



సీఐటీయూ జిల్లా మహాసభలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు

చోడవరం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు రాష్ట్ర వ్యాప్త ఉద్యమాన్ని చేపట్టనున్నట్టు సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు ప్రకటించారు. శనివారం ఇక్కడ జరుగుతున్న సీఐటీయూ 13వ జిల్లా మహాసభల్లో ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌పై కేంద్ర ప్రభుత్వం దొడ్డిదారిన ప్లాంట్ విభాగాలను ప్రైవేటీకరణ చేయడం ద్వారా పూర్తిగా నిర్వీర్యం చేసే ఎత్తుగడలకు పాల్పడుతున్నదని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ విభాగాలను ప్రైవేటు సంస్థలకు అప్పగించే చర్యలను కచ్చితంగా అడ్డుకుంటామన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు మద్దతుగా జాతీయ స్థాయిలో కార్మిక నేతల సహకారంతో ఈ ఏడాది డిసెంబరు 31 నుంచి 2026 జనవరి 5 వరకూ విశాఖపట్నంలో సీఐటీయూ జాతీయ మహాసభలు నిర్వహించబోతున్నట్టు సీహెచ్ నరసింగరావు తెలిపారు. ఈ జాతీయ మహాసభలకు దేశం నలుమూలల నుంచి కార్మికసంఘాల నేతలు హాజరుకాబోతున్నారన్నారు. వీరందరి మద్దతు కూడగట్టి, మోదీ ప్రభుత్వం దుర్మార్గ చర్యలను అడ్డుకుంటామన్నారు.

గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి రూ.100 కోట్లు కేటాయించాలి

గోవాడ షుగర్ ఫ్యాక్టరీని రాష్ట్ర ప్రభుత్వం మూసివేసి ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే చర్యలకు పాల్పడుతున్నదని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు విమర్శించారు. గోవాడపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రైతులు కార్మికుల బకాయిలు చెల్లించేందుకు రూ.30 కోట్లు విడుదల చేయాలన్నారు. ఫ్యాక్టరీని నడిపించేందుకు రూ.వంద కోట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు చేసి రైతులు, కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. మహాసభలో గోవాడ షుగర్ ఫ్యాక్టరీని ఆదుకోవాలని కోరుతూ తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సభలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు లోకనాథం, కార్యదర్శి ఆర్‌కేఎస్ కుమార్, సీఐటీయూ నాయకులు ఆర్. శంకరరావు, జి. కోటేశ్వరరావు, వీవీ శ్రీనివాసరావు, గూనూరు వరలక్ష్మి, ఎస్‌వీ నాయుడు తదితరులు పాల్గొన్నారు. సభకు ముందు కామ్రేడ్ సీతారం ఏచూరి ఇతర నేతలకు సంతాపం ప్రకటిస్తూ నివాళులు అర్పించారు.

సమృద్ధిగా యూరియా

... 5వ పేజీ తరువాయి

కదుపుతుంటారు. దీంతో సామాన్య రైతులకు ఎరువుల కొరత ఎదురవుతోంది. ఈ నేపథ్యంలో రైతు సేవా కేంద్రాల్లో యూరియా కోసం బయోమెట్రిక్ రిజిస్టర్ చేయించుకున్న రైతులకే పంపిణీ చేసేలా చర్యలు చేపట్టారు. ప్రైవేటు డీలర్లకు కేటాయించిన నిల్వల్లో 20 నుంచి 30 శాతం మాత్రమే కేటాయిస్తుండడంతో కొందరు డీలర్లు నకిలీ, నిషేధిత ఎరువులను అధికధరలకు రైతులకు అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నారు. అంతేకాక యూరియా కావాలంటే బయో ఎరువులు కొనాలని లింకు పెట్టడం, కృత్రిమ కొరత సృష్టించి, రైతులను ఇబ్బందులు పెడుతున్నారు.

విస్తృత దాడులు

ఇటీవల చోడవరంలోని ఓ ఎరువుల కంపెనీలో నాసిరకం యూరియాను ప్రముఖ కంపెనీకి చెందిన సంచుల్లో నింపి విక్రయిస్తున్న వ్యాపారుల గుట్టు రట్టయ్యింది. కె.కోటపాడు మండలంలో మరో వ్యాపారి తెలంగాణ నుంచి నిషేధిత ఎరువులను దిగుమతి చేసుకుని గోదాములో నిల్వ ఉంచగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, వ్యవసాయశాఖ అధికారులు పట్టుకుని కేసులు నమోదు చేశారు. ఇలాంటి వ్యాపారుల అక్రమాలకు చెక్ పెట్టేందుకు జిల్లా యంత్రాంగం అన్ని మండలాల్లో విజిలెన్స్ బృందాలను నియమించింది. ఈ బృందాలు రైతు సేవా కేంద్రాలు, ప్రైవేటు ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నాయి.

కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

యూరియా పక్కదారి పట్టకుండా ఫిర్యాదుల స్వీకరణకు జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. 8331 056471 నంబరును రైతులకు అందుబాటులో ఉంచారు. జిల్లాలోని రైతు సేవాకేంద్రాలలో ఈ నంబరును డిస్‌ప్లే చేసి యూరియా పంపిణీలో ఇబ్బందులు ఎదురైతే ఫిర్యాదు చేయాలని కోరారు. వ్యవసాయ సబ్ డివిజన్ల పరిధిలోనూ కంట్రోల్ విభాగాలను ఏర్పాటు చేశారు.

యూరియా కొరత లేదు...

జిల్లాలో యూరియా కొరత లేదని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు స్పష్టం చేశారు. ప్రస్తుతం రైతు సేవా కేంద్రాలు, సొసైటీల్లో నిల్వలున్నాయి. జిల్లాకు మరో 1500 టన్నుల యూరియా అవసరమని గుర్తించి, ఇప్పటికే ఇండెంట్ పెట్టామన్నారు. కొద్దిరోజుల్లో నిల్వలు రాగానే అవసరం మేరకు ఆయా మండలాలకు తరలిస్తామన్నారు. అధిక ధరలకు యూరియా విక్రయించినా, పక్కదారి పట్టించినట్టు తెలిసినా కంట్రోల్‌రూమ్‌కు ఫిర్యాదు చేయాలని రైతులకు సూచించారు.

ముగ్గురు ఎంపీడీవోలకు పదోన్నతి

... 5వ పేజీ తరువాయి

ఆచార్యులు జి.చంద్రకళకు పదోన్నతి ఇచ్చి అక్కడే కొనసాగాలని ప్రభుత్వం ఆదేశించింది. గన్నవరం ఎంపీడీవోను అల్లూరి జిల్లా డ్వామా కార్యాలయంలో ఏపీడీగా, పామర్రు ఎంపీడీవో కె.జ్యోతిని ఏపీవోగా, పెద్దాపురం ఎంపీడీవో డి.శ్రీలలితను విశాఖ డ్వామా కార్యాలయంలో విజిలెన్స్ అధికారిగా నియమించారు.

సబ్‌జైలు సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు?

... 5వ పేజీ తరువాయి

సీసీ కెమెరా కూడా లేకపోవడం గమనార్హం. భద్రతాపరమైన లోపాలు, జైలు సిబ్బంది నియామకంలో అలసత్వం వంటి కారణాలు అధికారుల పరిశీలనలో బయటపడ్డాయని చెబుతున్నారు. కారణాలేవైనా హోంమంత్రి సొంత జిల్లాలో ఖైదీలు పారిపోయిన ఘటన తీవ్ర సంచలనంగా మారింది.

పిన్న వయసులోనే అవాస్క్యులర్ నెక్రోసిస్

... 5వ పేజీ తరువాయి

సాఫ్ట్‌గా మారిపోతుంది. దీనివల్ల శరీర బరువు తట్టుకోలేక ఆకృతి మారిపోతుంది. తత్ఫలితంగా తీవ్రమైన నొప్పి, మూవ్‌మెంట్ తగ్గిపోవడం, కుంటుతారని వైద్యులు చెబుతున్నారు. కరోనా సమయంలో వినియోగించిన స్టెరాయిడ్స్, ఇతర కారణాల వల్ల రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టే తీరు పెరగడం వంటివి సమస్య తీవ్రత పెరగడానికి కారణమవుతున్నట్టు చెబుతున్నారు. ఆస్తమా, రుమటైడ్ ఆర్థరైటిస్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ మందులు వినియోగించిన వారిలోనే సమస్య కనిపిస్తోందన్నారు.

ఈ వయసు వారిలో ఎక్కువ..

గతంలో 50 ఏళ్లు దాటినవారు ఈ సమస్య బారినపడేవారు. ప్రస్తుతం యుక్త వయస్కులు అధికంగా కనిపిస్తున్నట్టు చెబుతున్నారు. ప్రతి పది కేసుల్లో ఆరు నుంచి ఏడు కేసులు 20 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్కులు ఉంటున్నారని పేర్కొంటున్నారు.

అధిక సంఖ్యలో వస్తున్న కేసులు

ఏవీఎన్‌తో బాధపడుతూ ఆస్పత్రికి వస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఒకప్పుడు నెలకు ఒకటి, రెండు వస్తుండేవి. ఇప్పుడు ప్రతి రోజూ ఓపీలో ఒకటి, రెండు కేసులు చూస్తున్నాం. సమస్య గ్రేడ్ 1, 2లో ఉన్నప్పుడు వస్తే కోర్ డీ కంప్రెషన్, బోన్ మ్యారో యాస్పిరేషన్ కాన్సంట్రేషన్ నిర్వహిస్తాం. కేజీహెచ్‌లో ఈ సర్జరీ ఉచితంగా నిర్వహిస్తున్నాం. గ్రేడ్ 3, 4లో వచ్చిన వారికి తీవ్ర ఇబ్బందులుంటాయి. వారికి పరిస్థితిని బట్టి వైద్య సేవలు అందిస్తాం. శస్త్ర చికిత్సలు, వైద్య పద్ధతుల ద్వారా నిలిచిపోయిన రక్త ప్రసరణను మళ్లీ సరిచేసి కోలుకునేలా చేస్తాం.

- డాక్టర్ ఎం.చంద్రశేఖరం నాయుడు, ఆర్థో విభాగాధిపతి, కేజీహెచ్

క్రైం... crime news

పాము కాటుతో యువకుడి మృతి


బుడ్డా శ్రీను (ఫైల్ ఫొటో)

దేవరాపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.అలమండకు చెందిన బుడ్డా శ్రీను (32) పాముకాటుకు గురై మృతి చెందాడు. ఇందుకు సంబంధించి ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం తన స్నేహితులతో కలిసి కళ్లం వైపు వెళ్లి మల విసర్జన చేస్తుండగా కేకలు వేస్తూ బయటకు వచ్చాడు. ఎడమ కాలి రెండో వేలుపై పాము కాటు వేయడంతో వెంటే ద్విచక్ర వాహనంపై కె.కోటపాడు హాస్పటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. శ్రీను తండ్రి గోవింద ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. శ్రీనుకు తల్లితండ్రులతోపాటు చెల్లి రమ్య ఉన్నారు. విషయం తెలుసుకున్న రైవాడ జలాశయ చైర్మన్ పోతల పాత్రునాయుడు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దృష్టికి తీసుకు వెళ్లి ప్రభుత్వపరంగా ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

భవనం పైనుంచి జారి పడి తాపీ మేస్త్రీకి తీవ్రగాయాలు


కేజీహెచ్‌లో రాజారావు

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం ఏఎల్‌పురంలో శుక్రవారం రాత్రి భవన నిర్మాణపనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు భవనంపై నుంచి కాలు జారి పడి తాపీ మేస్త్రీకి తీవ్ర గాయాలయ్యాయి. విజయనగరం జిల్లాకు చెందిన పాంగి రాజారావు(42) గత కొంత కాలంగా ఇక్కడ భవన నిర్మాణ పనులు చేస్తున్నాడు. ప్రమాదం జరిగిన వెంటనే రాజారావును నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించగా.. అక్కడ ప్రాథమిక చికిత్స అందించారు. అనతరం మెరుగైన వైద్య సేవల నిమిత్తం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం రాజారావు పరిస్థితి విషమంగా ఉందని అక్కడ వైద్యులు తెలిపారు.

అదుపుతప్పి ట్యాంకర్ లారీ బోల్తా


క్రేన్‌తో ట్యాంకర్ లారీని తొలగిస్తున్న దృశ్యం

పరవాడ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ జంక్షన్ నుంచి ఫార్మాసిటీ మీదుగా లంకెలపాలెం వెళ్లే ప్రధాన దారిలో శనివారం ఓ ట్యాంకర్ లారీ అదుపు తప్పి బోల్తాపడింది. లంకెలపాలెం నుంచి అచ్యుతాపురం సెజ్‌కు బయలుదేరిన లారీ సరిగ్గా సంపద తయారీ కేంద్రం వద్దకు వచ్చేసరికి రహదారిపై ఉన్న పెద్ద గొయ్యిను తప్పించే క్రమంలో అదుపు తప్పింది. ఆ సమయంలో లారీలో డ్రైవర్ ఒక్కరే ఉన్నాడు. అదృష్టవశాత్తూ గాయపడలేదు. సమాచారం అందుకున్న పోలీసులు రహదారికి అడ్డంగా ఉన్న లారీని క్రేన్ సాయంతో తొలగించారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

పాయకరావుపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారిపడడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలోని నర్సీపట్నంరోడ్డు, గుల్లిపాడు మధ్య శనివారం జరిగింది. ఇందుకు సంబంధించి రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలివి. అసోం రాష్ట్రం, గోలఘాట్ జిల్లాకు చెందిన రోమన్ గగోయ్ (35) అనే వ్యక్తి అసోంలోని ఫర్‌కటింగ్ రైల్వేస్టేషన్ జంక్షన్ నుంచి కేరళ రాష్ట్రం అలువా వరకు టికెట్ తీసుకుని డిబ్రుగర్ నుంచి కన్యాకుమారి వెళ్లే వివేక్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్నాడు. రైలు నర్సీపట్నంరోడ్డు, గుల్లిపాడు రైల్వేస్టేషన్ల మధ్యకు చేరేసరికి ప్రమాదవశాత్తూ జారిపడి అక్కడికక్కడే మృతిచెందాడన్నారు. మృతుడివద్ద లభించిన పాన్‌కార్డ్, ఫోన్ నంబరు ఆధారంగా అతడి బంధువులకు సమాచారం ఇచ్చామని, మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించి మార్చురీ రూమ్‌లో భద్రపరిచామన్నారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

ఇనుప స్తంభాన్ని ఢీకొట్టిన కారు

» జాతీయ రహదారిపై ఒడ్డిమెట్ట వద్ద ప్రమాదం

» స్వల్ప గాయాలతో బయటపడిన కుటుంబసభ్యులు


స్తంభాన్ని ఢీ కొట్టిన కారు

నక్కపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి పక్కన ఇనుప స్తంభాన్ని ఓ కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అందులోని ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఈ సంఘటన శనివారం మండలంలోని ఒడ్డిమెట్ట హైవే వద్ద జరిగింది. వివరాలిలా ఉన్నాయి... విశాఖ నుంచి విజయవాడకు ఇద్దరు పిల్లలతో కలిసి దంపతులు బయలుదేరారు. వారి కారు ఒడ్డిమెట్ట హైవే వద్ద అదుపుతప్పి, రహదారి పక్కన వున్న పెద్ద ఐరన్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు బోల్తాపడకుండా స్తంభంపై నిలువుగా వుండిపోయింది. ఘటనలో దంపతులకు స్వల్పగాయాలయ్యాయి. పిల్లలకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

బకాయిల కోసం నిరీక్షణ

... 5వ పేజీ తరువాయి

పనులు గత ఏడాది నవంబరులో ప్రారంభమయ్యాయి. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా నాలుగు మండలాల పరిధిలో మొత్తం 521 అభివృద్ధి పనులను రూ.42.29 కోట్ల వ్యయంతో చేపట్టారు. వీటిలో సీసీ రోడ్లు 473కు గాను 425 పనులు పూర్తయ్యాయి. బీటీ రోడ్లు తొమ్మిదింటికి ఏడు పూర్తికాగా, 35 శ్మశానవాటిక అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయి. స్థల వివాదాల కారణంగా 9 పనులు నిలిచిపోయాయి. మార్చిలో అప్‌లోడ్ చేసిన బిల్లులకు సంబంధించి అందాల్సిన రూ.14 కోట్ల బకాయిలతో పాటు మరో రూ.20 కోట్లు పనులు దాదాపు పూర్తికావచ్చాయి. వీటికి కూడా పంచాయతీరాజ్ అధికారులు బిల్లులు సిద్ధంచేస్తున్నారు.

మండలాల వారీగా చేపట్టిన పనులు

నర్సీపట్నం మండలంలో 57 అభివృద్ధి పనులు మంజూరు కాగా 49 పూరయ్యాయి. మార్చిలో రూ.4.1 కోట్లకు బిల్లులు పెట్టగా రూ.1.35 కోట్లు మాత్రమే మంజూరయ్యాయి. నాతవరం మండలంలో 167 పనులకు గాను 145 పూర్తి చేశారు. మార్చిలో రూ.6.45 కోట్లు బిల్లు అప్‌లోడ్ చేయగా రూ.2.47 కోట్లు మంజూరయింది. గొలుగొండ మండలంలో 170 పనులకు గాను 149 పూర్తి చేశారు. రూ.5.6 కోట్లకు బిల్లులకు రూ.2.1 కోట్లు విడుదలయ్యాయి. రూ.3.5 కోట్లు బకాయి ఉంది. మాకవరపాలెం మండలంలో 127 అభివృద్ధి పనులు మంజూరు కాగా 101 పనులు పూర్తిచేశారు. రూ.6.45 కోట్ల బిల్లులకు రూ.2.3 కోట్లు విడుదలయ్యాయి.

బకాయిల విషయమై పంచాయతీరాజ్ డీఈఈ ఈశ్వరరావు వద్ద ప్రస్తావించగా వచ్చే నెల 15వ తేదీలోగా పనులు పూర్తిచేసి బిల్లులు అప్‌లోడ్ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారని, త్వరలో బకాయిలు మంజూరవుతాయన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559